**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట | : 99854 38368 |
| చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు | : 99854 10940 |
| పలమనేరు, కుప్పం, పుంగనూరు | : 97036 18724 |
| మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి | : 99854 22298 |
| శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు | : 99890 59755 |


## లోకేశ్ అన్నా... పేద పిల్లల ఆకలి తీర్చండి



- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం కోసం ఎదురుచూపులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 23వేల మంది విద్యార్థులకు లబ్ధి




ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తిరిగి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తారనే ఆశతో పేద విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అమలులో ఉన్న ఈ పథకాన్ని 2019లో అధికారంలోకి రాగానే జగన్ రద్దు చేసేశారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ కాలేజీల్లో ఈ పథకం తిరిగి ప్రారంభిస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ కూడా ఇచ్చారు.

- తిరుపతి(విద్య)

### 62 కళాశాలల్లో 23వేల మంది

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల్లో 62 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఏటా సుమారు 23 వేలమంది విద్యార్థులు ఇంటర్ చదివేవారు. సాధారణంగా ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా పేద,మధ్య తరగతి కుటుంబాలు, ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతుంటారు. కనీసం లంచ్ బాక్స్ తెచ్చుకోలేనివారు వీరిలో చాలామంది ఉంటారు. దీనికితోడు వీరు దాదాపు 20 కిలోమీటర్ల దూరం నుంచి కూడా కళాశాలలకు వస్తుంటారు. దీంతో కళాశాల సమయంకంటే గంట, లేక రెండు గంటల ముందే ఇళ్లనుంచి బయల్దేరుతారు. అల్పాహారమో, లేక చద్దన్నమో తినేసి ఇళ్లనుంచి కళాశాలలకు చేరుకునే విద్యార్థులు మళ్లీ సాయంత్రం ఇళ్లకు చేరేవరకు ఆకలితోనే చదువులు సాగిస్తారు. ఇప్పుడు నారా లోకేష్ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి కావడంతో అటు విద్యార్థులతోపాటు ఇటు అధ్యాపకులు సైతం ప్రభుత్వంవైపు ఆశగా చూస్తున్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.

### పేద పిల్లలకు ఇది అవసరం

మధ్యాహ్న భోజనం లేనందువల్ల హాజరు శాతం తగ్గుతోంది. కొంతమంది మధ్యాహ్న భోజనంకోసం ఇళ్లకు వెళ్లినవారు తిరిగి కళాశాలలకు రావడంలేదు. అలాగే డ్రాపౌట్స్ కూడా పెరుగుతున్నారు. మధ్యాహ్న భోజనం అమలుచేస్తే ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పెరుగుతాయి.

- రవి, జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



### మా ఆకలి తీర్చండి



ఉదయం కళాశాలకు వచ్చినప్పటినుంచి సాయంత్రం ఇంటికి వెళ్లేవరకు భోజనం లేకుండా ఆకలితో ఉండాల్సి వస్తోంది. దీంతో చదవుపై దృష్టి సారించలేకపోతున్నాం. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే పేద, గ్రామీణ విద్యార్థులకు ఎంతో మేలు చేసినవారవుతారు.

- ఏఎస్ మోహన్‌కుమార్, ఎంపీసీ ద్వితీయ, పుత్తూరు

### చాలామంది బాక్సులు తెచ్చుకోలేరు

చుట్టుపక్కల గ్రామాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థుల్లో చాలామంది లంచ్ బాక్సులు తెచ్చుకునే పరిస్థితి లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏమీ తినకుండా ఉండాలంటే కష్టంగా ఉంటోంది. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే చాలా బాగుంటుంది.

- వినయ్‌కుమార్, సీఈసీ ద్వితీయ, చంద్రగిరి



### ఒకరోజు తింటే.. మరో రోజు పస్తు

ప్రతి రోజూ ఇంటి నుంచి భోజనం తెచ్చుకోలేం.దీంతో మధ్యాహ్నం ఒకరోజు తింటున్నాం.. మరో రోజు పస్తు ఉంటున్నాం. డబ్బులు ఉంటే హోటళ్లలో తినేది, లేదంటే మానుకునేది. ఆకలేసినా మళ్లీ సాయంత్రం ఇంటికి వెళ్లేవరకు ఉండక తప్పదుకదా.



- ఎం. సూర్యాచారి, ఐసీఎస్ఈ ఒకేషనల్, చంద్రగిరి

## చిన్నారిపై వృద్ధుడి లైంగిక దాడి

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఓజిలి, ఆగస్టు 1: ఓ చిన్నారిపై వృద్ధుడు లైంగిక దాడి చేశాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదైంది. ఓజిలి ఎస్ఐ రవిబాబు తెలిపిన వివరాల మేరకు.. ఒకటో తరగతి చదువుతున్న గిరిజన బాలిక (6) తన తమ్ముడు కనిపించలేదని సమీపంలోని పొలాల వద్దకు బుధవారం మధ్యాహ్నం వెళ్లింది. ఆ సమయంలో మద్యం తాగి అటుగా వస్తున్న ఈశ్వరయ్య (60) చిన్నారికి డబ్బులు ఆశచూపి చెట్టుకిందకు తీసుకెళ్లాడు. ఆపై లైంగిక దాడి చేయడంతో చిన్నారి భయపడి కేకలు పెడుతూ పాఠశాల వద్దకు పరుగులు తీసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ విషయాన్ని ఎంఈవో శైజలకు తెలియజేశారు. ఆమె వెంటనే పాఠశాల వద్దకొచ్చి ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఆయన పూర్తి వివరాలను సేకరించి వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు గురువారం మీడియాకు తెలిపారు.

## నేడు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావు తొలిసారిగా డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఈకార్యక్రమం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై నేరుగా టీటీడీ ఈవోతో మాట్లాడవచ్చు. దీనికోసం 0877 2263261 నెంబరుకు ఫోన్ చేయాలి.

## ప్రైవేటు ల్యాబుల దందా

- రోగులను దోచేస్తున్నారు
- గత ప్రభుత్వ హయాంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి




మారుమూల ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు ల్యాబులు

**జిల్లాలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా కేసులు ప్రబలుతున్నాయి. వీటితోపాటు జలుబు, దగ్గు వంటివి వచ్చి ప్రైవేటు వైద్యుల దగ్గరకు వెళితే వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిందే. అందువల్ల కార్పొరేట్ ఆస్పత్రులు మొదలు ఆర్ఎంపీ క్లినిక్‌ల వరకు ప్రతి ఒక్కరూ తమకు అనుసంధానంగా ప్రైవేటు ల్యాబులు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడే కొందరు చేతివాటం చూపుతున్నారు. ప్రైవేటు ల్యాబులపై వైద్య ఆరోగ్యశాఖ అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగా ఉండటంతో అందినకాడికి రోగులను దోచేస్తున్నారు.**

- తిరుపతి (వైద్యం)

తిరుపతి నగరంతోపాటు శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, వరదయ్యపాళెం, సత్యవేడు, పుత్తూరు, నగరి తదితర ప్రాంతాల్లో 50 శాతానికిపైగా ప్రైవేటు ల్యాబులు వైద్యఆరోగ్యశాఖ అధికారుల అనుమతులు లేకుండానే నడుస్తున్నాయి. మారుమూల ప్రాంతాల్లో అయితే ఏకంగా మందుల దుకాణాల్లోనూ నిబంధనలు పాటించకుండా ప్రైవేటు ల్యాబులు ఏర్పాటు చేసున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 140 ప్రైవేటు ల్యాబులు ఉన్నాయని అధికారుల లెక్కల చెబుతున్నా.. అనధికారికంగా మరో 150పైగానే ఉన్నాయి. వీటిల్లో పనిచేసే టెక్నీషియన్లు పారామెడికల్ బోర్డు రిజిస్ట్రేషన్ ఐదేళ్లకోసారి చేయించుకోవాల్సి ఉన్నా అదీ జరగడం లేదు. దీనికితోడు అర్హత లేని సిబ్బంది విధులు నిర్వహిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

### తనిఖీలు లేకపోవడం వల్లేనా?

గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అర్హత, అనుభవం, అనుమతి లేకపోయినా కేవలం పాలకుల అండదండలతో పుట్టగొడుగుల్లా ప్రైవేటు ల్యాబులు పుట్టుకొచ్చాయి. వీటిపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేయడానికి వెళితే అప్పటి అధికారపార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు రావడంతో క్రమక్రమంగా ప్రైవేటు ల్యాబుల జోలికి అధికారులు వెళ్లడం మానేశారు. ప్రస్తుతం కూడా తనిఖీలు చేయడం లేదన్న విమర్శలొస్తున్నాయి.

### అర్హత లేని వారే ఉద్యోగులు

ప్రైవేటు ల్యాబుల్లో చాలాచోట్ల అర్హతలేని వారే ఉద్యోగులుగా ఉన్నారు. అరకొరగా అవగాహన కల్పించి, తక్కువ వేతనాలతో కానిచ్చేస్తూ.. రోగుల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ప్రధానంగా అత్యవసర పరిస్థితుల్లో చికిత్స పొందుతున్న వారికి సరైన వ్యాధి నిర్ధారణ జరగ్గ తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### ఇష్టానుసారంగా ధరలు

ప్రతీ ప్రైవేటు ల్యాబులోనూ చేసే పరీక్షలు.. వాటికి సంబంధించిన ధరలను వివరిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలి. కానీ ఎక్కడా ఇవి కానరావు. వారు చెప్పిందే ధరగా నిర్ణయించి రోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. హెచ్‌బీ పరీక్షకు రూ.300 అయితే.. రూ.550-700 వరకు తీసుకుంటున్నారు. సీబీపీకి రూ.200లైతే రూ.400-600, మలేరియా, టైఫాయిడ్, వైడల్ పరీక్షలకు రూ.200లైతే రూ.400-800, డెంగ్యూ పరీక్షకు రూ.500లైతే రూ.800-1200 వరకు వసూలు చేస్తున్నారు. లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్, సీబీపీ పరీక్షలకు రూ.300లైతే రూ.600లకుపైగా తీసుకుంటున్నారు. స్క్రీనింగ్ పరీక్షకు రూ.700లకుగాను రూ.వెయ్యికిపైగా వసూలు చేస్తున్నారు.

### నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం

అనుమతులు, నిబంధనలు పాటించని ప్రైవేటు ల్యాబులను సీజ్ చేస్తాం. ఫిర్యాదులు వస్తున్న ల్యాబులపై తనిఖీ చేసి చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా ఇంకా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు ల్యాబులు నిర్వహించినా, రోగుల నుంచి అధిక ధరలు వసూలు చేసినా ఫిర్యాదు చేస్తే పూర్తిగా అరికడతాం.

- డాక్టర్ శ్రీహరి, వైద్యఆరోగ్యశాఖాధికారి



## మీరేం చేస్తున్నారు?

- తిరుచానూరు పెద్ద చెరువుకు గండి ఘటనలో అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1: తిరుచానూరు పెద్ద చెరువుకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు గండి కొట్టడంతో అందులోని నీరు వీవీనగర్, పలు కాలనీలను ముంచెత్తింది. దీంతో స్థానికులు తీవ్ర అవస్థ పడిన విషయం తెలిసిందే. 'తిరుచానూరు పెద్ద చెరువుకు గండి' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో కథనం కూడా ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'అసలు చెరువుకు గండి కొట్టే ధైర్యం ఎవరికి వచ్చింది.. వర్షాలు లేవు కాబట్టి సరిపోయింది.. అసలు మీరేం చేస్తున్నారు' అంటూ మండిపడ్డారు. చెరువు ఎంతమేరకు ఆక్రమణకు గురైంది.. సప్లయ్ చానళ్ల పరిస్థితిపై విచారించి, నివేదిక అందజేయాలని ఆదేశించారు.

### చెరువు స్థలాన్ని కాపాడాలంటున్న స్థానికులు

వైసీపీ ప్రభుత్వం హయాంలో పర్యాటక అభివృద్ధి పేరుతో చెరువులోని 17ఎకరాలను తుడాకు కేటాయించారు. అయితే ఈ భూమిని ఓ ప్రైవేటు సంస్థకు తుడా లీజుకిచ్చేసింది. అప్పటినుంచి చెరువు ఆనవాళ్లు కోల్పోవడం మొదలైంది. ప్రధానంగా నీరున్న ప్రాంతంలోనూ చాలా భాగాన్ని చదును చేసేవారు.ఇక మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా పద్మావతిపురంలో కొంతమంది ఇళ్లు కోల్పోయారు.ఆ నిరాశ్రయుల ముసుగులోవారికి కొంతభాగం ఇచ్చి..75శాతం వైసీపీ నేతలే కబ్జా చేసి (పద్మావతిపురం శ్మశానం సమీపంలో) షాపింగ్ కాంప్లెక్సు, ఇళ్లు నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చినా పనులు ఆగడం లేదు. దీనిపై కలెక్టర్ ఆరా తీసి.. చెరువు స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## శ్రీవారి పుష్కరిణికి మరమ్మతులు ప్రారంభం

తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పుష్కరిణి మరమ్మతు పనులు గురువారం నుంచి మొదలయ్యాయి. సాధారణంగా ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలకు ముందు పుష్కరిణిలోని మరమ్మతులను పూర్తి చేసి నీటిని నింపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా గురువారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేసి మరమ్మతులు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఈక్రమంలో గురువారం భక్తుల అనుమతిని రద్దు చేసి ప్రస్తుతం ఉన్న నీటిని తోడే పనులను మొదలుపెట్టారు. తొలి పదిరోజులు నీటిని తొలగిస్తారు. తర్వాత పదిరోజులు మరమ్మతులేవైనా ఉంటే గుర్తించి పూర్తి చేస్తారు. చివరి పదిరోజుల్లో తిరిగి నీటిని నింపుతారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి పుష్కరిణిని భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తారు. కాగా, ప్రస్తుతం భక్తులకు ఇబ్బంది లేకుండా పుష్కరిణి వెనుకభాగంలో ప్రత్యామ్నాయంగా నీటి కొళాయిలను ఏర్పాటు చేశారు. భక్తుల అనుమతిని రద్దు చేయడంతో నిత్యం కిటకిటలాడే పుష్కరిణి బోసిపోయింది.



భక్తుల్లేక బోసిపోయిన పుష్కరిణి

## ముక్కంటికే పంగనామమా?

- ఒప్పంద ఉద్యోగికి రహస్యంగా జీతం ఫైల్ పంపడంపై అభ్యంతరాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1: ముక్కంటి ఆలయంలో ఓ ఒప్పంద ఉద్యోగికి రహస్యంగా 18 నెలల కాలానికి జీతం కోసం ఫైల్ పంపడంపై సర్వత్రా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో ఓ ఒప్పంద ఉద్యోగి అటెండర్‌గా విధులు నిర్వహించేవాడు. వైసీపీ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో పీఆర్వోగా మారి.. అక్రమార్జన చేయడంతోపాటు అజమాయిషీ చెలాయించాడు. పీఆర్వో కార్యాలయంలో పలుమార్లు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించాడు. 18 నెలల కిందట ఆయన్ను దుకాణాలు అద్దె వసూలు చేసే విభాగానికి అంతర్గతంగా అధికారులు బదిలీ చేశారు. రాజకీయ అండ ఉన్న తననే బదిలీ చేస్తారా? అంటూ ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా అనధికారికంగా విధులకు గైర్హాజరయ్యారు. దాంతో క్రమశిక్షణ చర్యలు కింద ఆ ఒప్పంద ఉద్యోగిని విధులనుంచి పక్కన పెట్టారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ ఉద్యోగి.. ముక్కంటి ఆలయ పాలకమండలి, కొందరు వైసీపీ నాయకులకు ముడుపులు చెల్లించి తిరిగి విధుల్లో చేరేందుకు ప్రయత్నాలు సాగించాడు. విధుల్లో చేరకుండానే పాలకమండలి నాయకులతో కలిసి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే వారం ముందు ప్రారంభోత్సవ వేడుకల్లో హల్‌చల్ చేశాడు. దీనిపై అప్పట్లోనే విధుల్లో లేకుండానే వైసీపీ అండతో ఈ ఉద్యోగి వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆ వెంటనే ఎన్నికల కోడ్ వెలువడింది. దాంతో ఒప్పంద ఉద్యోగి విధుల్లో చేరే అంశం బ్రేక్‌పడింది. అప్పటినుంచి దూరంగా ఉన్న ఆయన కొద్దిరోజులుగా ఆలయంలోని ఓ కీలక అధికారితో మంతనాలు సాగించాడు. ఆ అధికారి ఇతడిని విధుల్లోకి తీసుకోవడంతోపాటు 18 నెలలు గైర్హాజరు అయిన కాలానికి జీతం మంజూరు చేసేలా దేవదాయశాఖకు గురువారం ప్రతిపాదనలు పంపాడు. ఈ విషయం బయటకు రావడంతో కీలక అధికారి తీరుపై ఆలయంలోని ఉద్యోగ వర్గాల్లోనే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి.

**శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానము**
శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా - 517644

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

ఆర్.సి. నెం. ఇ1/2029/2021 తేది : 20-07-2024

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానమునకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనుల నిమిత్తము సివిల్ మరియు ఎలక్ట్రికల్ పనులకు సంబంధించి ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా ఇ-టెండర్లు కోరబడుచున్నవి. వివరములకై **www.tender.apeprocurement.gov.in** నందు పరిశీలించవచ్చును. ఇతర వివరములకై సెల్ నెం. **08578-222240**నందు సంప్రదించగలరు.

శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి సేవలో
సం/- యస్.వి.యస్.యన్.మూర్తి, కార్యనిర్వహణాధికారి

The ultimate foundation for
YOUR CHILD'S BRIGHT FUTURE.
Dr. C Gangi Reddy
Chancellor, Annamacharya University

ADMISSIONS OPEN 2024-25
B.Sc. (Hons.) Agriculture
(as per ICAR Curriculum)
INFRASTRUCTURE, INSTRUCTIONAL FACILITIES,
FEE STRUCTURE AS PER GOVT. NORMS
ELIGIBILITY
10+2 examination with a minimum of 50% marks in Inter Bi.P.C / MBi.P.C / Diploma in Agriculture / Inter Vocational (C.P.M) from any recognized board
అడ్మిషన్స్ జరుగుతున్నవి @ www.angrau.ac.in ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

ANNAMACHARYA UNIVERSITY
EXCELLENCE IN EDUCATION; SERVICE TO SOCIETY
(ESTD. UNDER AP PRIVATE UNIVERSITIES (ESTABLISHMENT AND REGULATION) ACT, 2016)
RAJAMPET, Annamayya District, AP - 516126, India
LIMITED MANAGEMENT QUOTA SEATS AVAILABLE
Contact for Admissions: +91 9848998641, 9154147257
www.annamacharyauniversity.edu.in

## తొలిరోజే 97.6 శాతం పింఛన్ల పంపిణీ



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను జిల్లాలో తొలి రోజే 97.6 శాతం పంపిణీ చేశారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నగదు అందించారు. 691 సచివాలయ పరిధిలో వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు ఇలా మొత్తం 2,67,772మంది లబ్ధిదారులు ఉండగా, 2,61,300 మందికి పింఛన్లు అందాయి. మిగిలిన వారిలో కొందరికి సాంకేతిక సమస్య తలెత్తగా, ఇంకొందరు వేరే ఊర్లకు వెళ్లి ఉన్నారు. ఇటువంటివారికి శుక్రవారం పంపిణీ చేస్తారు. ఇక కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిణీ ప్రక్రియను పలుచోట్ల తనిఖీ చేశారు. ఏర్పేడు మండలం ఆమందూరు గ్రామ పంచాయతీలో అయితే కలెక్టర్ స్వయంగా లబ్ధిదారుకు పింఛను నగదు అందజేశారు. అలాగే రేణిగుంట మండలం జీపాళెంకు చెందిన దొరస్వామిరెడ్డి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో సచివాలయ సిబ్బంది వెళ్లి పింఛను నగదు అందజేశారు. ఇలాగే పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకూ పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న దొరస్వామిరెడ్డికి పింఛను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు

తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.93 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 67,916 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,010 మంది తలనీలాలు సమర్పించారు.

## రీజనల్ సైన్స్‌సెంటర్‌లో 10నుంచి స్వాతంత్ర్య దిన వేడుకలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస నెప్రూ

మంగళం, ఆగస్టు 1: తిరుపతి రీజనల్ సైన్స్‌సెంటర్‌లో తిరుపతికి చెందిన వే ఫౌండేషన్, సేవ్ సాయిల్ సహకారంతో ఈనెల 10 నుంచి 15వ తేదీ వరకు స్వాతంత్ర్య దిన వేడుకలను నిర్వహిస్తున్నట్లు రీజనల్ సైన్స్‌సెంటర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస నెప్రూ తెలిపారు. గురువారం ఇండిపెండెన్స్‌డే అండ్ కాంపిటేషన్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పోస్టర్ పెయింటింగ్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోస్టర్ పెయింటింగ్ విభాగంలో రెండు నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎలాంటి రిజిస్ట్రేషన్ అవసరం లేదన్నారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో మూడు విభిన్నమైన థీమ్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు. సంబంధిత లింక్‌లో ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామన్నారు. డాక్టర్ అంకయ్య, డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు.

## మహాభారత ఉత్సవాలు ప్రారంభం

తిరుచానూరు, ఆగస్టు 1: తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడిలో శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయని, గురువారం నుంచి రాత్రి నాటకాలు ప్రారంభమయ్యాయని గ్రామస్థులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు మహాభారత హరికథా కాలక్షేపం జరుగుతుందని పేర్కొన్నారు. 2న హిడింబాసుర వధ, 3న బకాసుర వధ(బలిబండి), 4న ద్రౌపదీ కల్యాణం, 5న చిత్రాంగి విలాసం, 6న ద్రౌపదీ వస్త్రాపహరణం, 7న గయోపాఖ్యానం, 8న కీచక వధ, 9న ఉత్తర గోగ్రహణం, 10న శ్రీకృష్ణరాయబారం, చివరన 11న ఆదివారం జరిగే దుర్యోధన వధతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు.

## తిరుచానూరు సీఐగా సునీల్‌కుమార్



తిరుచానూరు, ఆగస్టు 1: అనంతపురం రేంజీ పరిధిలో 17మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా తిరుపతి ఏసీబీలో పనిచేస్తున్న డి.సునీల్‌కుమార్‌ను తిరుచానూరు సీఐగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ శ్రీకాంత్‌రెడ్డిని వీఆర్‌కు పంపించారు. అలాగే తిరుపతి పీటీసీలో పనిచేస్తున్న రాజగోపాల్ నాయుడు హిందూపురం వన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. తిరుపతి సీఐడీలో పనిచేస్తున్న అంజనేయులు హిందూపురం రూరల్‌కు బదిలీ అయ్యారు. సీఐడీలో పని చేస్తున్న డీఎస్పీ రసూల్ సాహెబ్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సోమవారం తిరుచానూరు సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సునీల్‌కుమార్ తెలిపారు.

## బాలల హక్కులను పరిరక్షించండి


మాట్లాడుతున్న చిట్టిబాబు

తిరుచానూరు, ఆగస్టు 1: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జాతీయ బాలల హక్కుల ప్రతినిధి చిట్టిబాబు అన్నారు. తిరుచానూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం బాలల హక్కుల పరిరక్షణపై సదస్సు జరిగింది. తిరుపతి డీవైఈవో బాలాజీ, నోడల్ అధికారి శ్రీధర్, హెచ్‌ఎం మురళి, రీసోర్స్ పర్సన్ చెంగల్‌రాజు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతకు నివాళి


శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాని


రామచంద్రాపురం, ఆగస్టు 1: రావిళ్లవారిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీరాములు నాయుడి కర్మక్రియలకు గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరై, చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. టీడీపీ అభివృద్ధి శ్రీరాములు నాయుడు ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం శ్రీరాములు నాయుడు కుటుంబసభ్యులను పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్థన్‌చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, బాబుయాదవ్, హరిప్రసాద్, మండల నాయకులు గిరి నాయుడు, లీగల్‌సెల్ అధ్యక్షుడు మునెయ్య, జీవరత్నం, సురేష్ నాయుడు, జయచంద్ర నాయుడు పాల్గొన్నారు.

## విద్యాసామగ్రి పంపిణీ



రామచంద్రాపురం, ఆగస్టు 1: రాయలచెరువు పేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 40మంది విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన భానుప్రియ, జనార్థన్ దంపతులు గురువారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ రామయ్య, హెచ్‌ఎం భూపతిరెడ్డి, కమిటీ సభ్యులు గోపి, మైథిలి, కృష్ణమ్మ, లోకేశ్వరి పాల్గొన్నారు.

## టీటీడీ వీఎస్వోగా రాంకుమార్ బాధ్యతల స్వీకారం



తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ వీఎస్వోగా రాంకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన వింగ్ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు తీసుకున్నారు. నూతన వీఎస్వోకు పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### టీటీడీ కల్యాణకట్ట డిప్యూటీ ఈవోగా వెంకటయ్య

టీటీడీలో పలువురు డిప్యూటీ ఈవోలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలో డిప్యూటీఈవోగా ఉన్న వెంకటయ్యను తిరుమల కల్యాణకట్ట డిప్యూటీఈవోగా బదిలీ చేశారు. ప్రస్తుతం కల్యాణకట్ట డిప్యూటీఈవోగా ఉన్న సెల్వంను తిరుపతికి బదిలీ చేశారు. అలాగే రిసెప్షన్ డిప్యూటీఈవో1గా హరీంద్రనాథ్‌ను ఆర్2గా నియమించగా, ఆస్థానంలో ఆర్2గా ఉన్న భాస్కర్‌ను మార్చారు. శ్రీవారి ఆలయ డిప్యూటీఈవోగా కూడా మార్పు చేయాలని ఉన్నతాధికారులు భావించినప్పటికీ కొన్ని ఇబ్బందుల వల్ల వాయిదా వేసినట్టు సమాచారం.



## అభినందన

తిరుపతిరూరల్, ఆగస్టు 1: మాజీమంత్రి గల్లా అరుణకుమారి జన్మదినాన్ని ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్, పుదిపట్ల సర్పంచ్ బడి సుధాయాదవ్ నేతృత్వంలో గురువారం ఊటీలో ఘనంగా నిర్వహించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు. మాజీ ఎంపీ గల్లా జయదేవ్ తదితరులు పాల్గొన్నారన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నాం

● పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పులివర్తి నాని


అరిగిలవారిపల్లెలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి, ఆగస్టు 1: ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. గురువారం మండలంలోని అరిగిలవారిపల్లెలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నా, ఎన్ని కష్టాలు వచ్చినా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని చెప్పారు. ఎంపీడీవో వెంకట సూర్యసాయి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమృత, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు మేడసాని కుమార్, చెంగల్రాయులు, నగరం రమేష్, బాలకృష్ణమూర్తి, లోకాద్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### పాకాల-దామలచెరువు బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి

పాకాల: పాకాల-దామలచెరువు బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని నాని హామీ ఇచ్చారు. దామలచెరువు పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన పింఛన్ల పంపిణీ సభలో ప్రసంగించారు. సమస్యలన్నీ పరిష్కరిస్తామని, ప్రధానంగా మండలంలో చెరువుల అనుసంధానం పనులు పూర్తిచేసి నీళ్లు నింపడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. దామలచెరువు పంచాయతీలో ఆర్థిక అవకతవకలు, అవినీతిపై విచారణ చేయించి, కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. ఎంపీడీవో నాగేంద్రబాబు, సర్పంచ్ సునీత, ఎంపీటీసీ రాజ్యలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకుడు పలపల దశరథ నాయుడు, టీడీపీ మండల కన్వీనర్ నాగరాజు నాయుడు, జనసేన జిల్లా కార్యదర్శి నాజీర్, టీడీపీ నాయకులు రఘునాథనాయుడు, ఎల్.కోటి, చిన్నప్ప నాయుడు, సుధాకరయ్య, చలపతి పాల్గొన్నారు.

**తిరుపతి రూరల్:** మండలం దుర్గసముద్రం గ్రామంలో ఉదయం ఆరు గంటలకే ఎమ్మెల్యే నాని చేతులమీదుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.మునిశేఖర్, తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, నాయకులు డాలర్స్ దివాకర్‌రెడ్డి, చిన్ని, బాబు, సుధాకర్, రవి, చంద్రశేఖర్, బాబురాయల్, నాగరాజు, శంకర్, మోహన్, ఓసీ రాయల్, ఢిల్లీ, సురేంద్రరెడ్డి, నరసింహారెడ్డి, కుమార్, సంపత్ పాల్గొన్నారు.

**రామచంద్రాపురం:** దేశూరికండ్రిగ గ్రామంలో ఎమ్మెల్యే నాని పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, పలువురికి అందజేశారు. తిరుమలరెడ్డి, చిన్నబాబు, హరిప్రసాద్, నరసింహారెడ్డి, గిరిబాబు, ఢిల్లీనాథరెడ్డి పాల్గొన్నారు.

# కాల్వ పొరంబోకు భూమిని కాపాడండి..!

● ఆక్రమణలపై విచారణ చేయాలని పేరూరు టీడీపీ నేతల వినతి


పొరంబోకులో చేపట్టిన నిర్మాణాలకు ఎన్వోసీలు చూపుతున్న టీడీపీ నేతలు వెంకటేష్, నాగరాజు తదితరులు

తిరుపతిరూరల్, ఆగస్టు 1: తిరుపతి రూరల్ మండలం పేరూరులో సర్వేనెంబరు 460, 460/2లోని 2.98 ఎకరాల మొగిలికశం పొరంబోకును ఆక్రమణదారుల నుంచి రెవెన్యూ అధికారులు కాపాడాలని టీడీపీ గ్రామకమిటీ ప్రధానకార్యదర్శి కాయం వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం ఆంధ్రజ్యోతిలో కాల్వ పొరంబోకు ఆక్రమణకు యత్నం పేరిట ప్రచురితమైన కథనానికి స్పందించి టీడీపీనేతలు దామినేటి నాగరాజు, జ్ఞానేశ్వరరెడ్డి, మహేష్, లక్ష్మీప్రసన్నలతో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన కొందరు వైసీపీనేతలు కాలువభూమిని ఎక్స్‌కవేటర్‌తో చదునుచేసి ఆక్రమణకు ప్రయత్నించారని, స్థానికులతో కలిసి టీడీపీనేతలు అడ్డుకోవడంతో వెనుతిరిగారని తెలిపారు. గతంలోనూ ఈభూమి ఆక్రమణకు ప్రయత్నించగా, తాము తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో హెచ్చరికబోర్డు ఏర్పాటు చేశారని చెప్పారు. వైసీపీనేతలు రాత్రికి రాత్రి ఆబోర్డును తొలగించి ఆక్రమణకు దిగారని ఆరోపించారు. దీన్ని అడ్డుకునేందుకు వచ్చిన గ్రామస్థులపై దాడికి కూడా దిగారన్నారు. ఇదేకాల్వస్థలంలో గతవైసీపీ ప్రభుత్వంలో దాదాపు 10వరకు అక్రమనిర్మాణాలు చేపట్టారని, వాటికి పంచాయతీ అధికారులు ఎన్వోసీలు ఇవ్వడంతో విద్యుత్‌మీటర్లు కూడా తెచ్చుకున్నారని తెలిపారు. దాదాపు మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మొగిలికశం కాలువగడ్డ ఇప్పటికే రెండు ఎకరాలకు పైగా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిందని, మిగిలిన కాలువభూమిని కూడా కబ్జా చేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని వాపోయారు. గతంలో జరిగిన ఆక్రమణలను టీడీపీనేతలపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని, మండల రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడితే ఆక్రమణల్లో ఎవరిపాత్ర ఏమిటన్న వాస్తవాలు వెలుగు చూస్తాయని తెలిపారు. ఈభూమిలో ఆక్రమణలను తొలగించి యథాస్థితిలో ఉంచేలా సత్వర చర్యలు చేపట్టాలని వారు కోరారు.

# భాకరాపేట ఘాట్‌లో ప్రమాదం

● అదుపుతప్పి కొండరాయిని ఢీకొన్న కేఎస్ ఆర్టీసీ బస్సు
● తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ ● 17 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలు


భాకరాపేట ఘాట్‌లో కొండరాయిని ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు

చంద్రగిరి ఆగస్టు 1: చంద్రగిరి మండల పరిధిలోని భాకరాపేట ఘాట్‌లో తిరుపతి - మదనపల్లె జాతీయ రహదారిలో గురువారం కర్ణాటక ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కొండరాయిని ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ దిలీప్‌కుమార్‌కు తీవ్రగాయాలవగా, 17 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బెంగళూరు నుంచి తిరుపతికి వస్తుండగా మార్గమధ్యంలో భాకరాపేట ఘాట్‌లోకి రాగానే బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి పక్కనున్న బండరాయని ఢీకొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సు.. లోయలో పడకుండా బండరాయి వైపు తిప్పించి ఢీకొనడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బస్సుడ్రైవర్‌కి తీవ్ర గాయాలవగా, 17 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరగడంతో ఆదారిలో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'ఆర్చరీ, మార్షల్ ఆర్ట్స్'లో శిక్షణ ప్రారంభం



తిరుపతి రూరల్, ఆగస్టు 1: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో చదివే విద్యార్థుల కోసం ఆర్చరీ, మార్షల్ ఆర్ట్స్ శిక్షణ శిబిరాన్ని గురువారం వర్సిటీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభించారు. వర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇంటర్నల్ కంప్లయింట్‌సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో విద్యార్థులకు 15 రోజులపాటు ఈశిక్షణ ఇవ్వనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ వి.సేతురామ్ పేర్కొన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు వర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహించేలా చర్యలు చేపడుతామన్నారు. అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్ల, ఐసీసీ నోడల్ అధికారి ఆర్.దీప్త, యాంటీర్యాగింగ్‌సెల్ మెంబరు డాక్టర్ డి.జ్యోతి, చీఫ్ వార్డెన్ పి.వెంకట్రావు, డాక్టర్ ఎం.సుజాత, డాక్టర్ బుల్బీదాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో బదిలీలు

తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీలోని ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు బదిలీ చేస్తూ గురువారం టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో.. ఎస్‌ఈ-2గా తిరుమలలో విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్‌రెడ్డిని ఎస్‌ఈ-3గా తిరుపతికి బదిలీ చేశారు. ఇక, సీనియార్టీ ప్రకారం చీఫ్ ఇంజనీరింగ్ పోస్టు తనకే రావాలంటూ హైకోర్టు ద్వారా పోరాటం చేస్తున్న ఎస్‌ఈ-3 సత్యనారాయణను ఎస్‌ఈ-2గా నియమించారు. అలాగే తిరుమలలో ఈఈగా ఉన్న శ్రీహరిని తిరుపతి పరిపాలన భవనంలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. ఆపోస్టులో ఉన్న సుబ్రహ్మణ్యంను ఈఈ1గా తిరుమలకు బదిలీ చేశారు. ఈఈ1గా ఉన్న జగన్మోహన్‌రెడ్డిని గీఐగా తిరుపతికి బదిలీ చేశారు. ఆస్థానంలో ఉన్న వేణుగోపాల్ ఈఈ5గా తిరుమలకు బదిలీ అయ్యారు. ఈఈ5గా ఉన్న సురేంద్రనాథరెడ్డిని విజయవాడకు బదిలీ చేశారు. విజయవాడలోని సుధాకర్‌ను వాటర్‌వర్క్స్ ఈఈ9గా తిరుమలకు బదిలీ చేశారు. అలాగే తిరుమల ఎలక్ట్రికల్ డీఈగా ఉన్న రవిశంకర్‌రెడ్డిని ఎలక్ట్రికల్1గా తిరుపతికి బదిలీ చేశారు. ఆస్థానంలో ఉన్న చంద్రశేఖర్ తిరుమల ఎలక్ట్రికల్ డీఈగా బదిలీ చేశారు. గతం వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో భారీగా అక్రమాలు జరిగాయని విమర్శలు వచ్చిన నేపథ్యంలో తాజా బదిలీలు చర్చనీయాశంగా మారాయి.

### అదనపు ఈవో కార్యాలయం సూపరింటెండెంట్లు బదిలీ

తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయంలోని ఇద్దరు సూపరింటెండెంట్లు బదిలీ అయ్యారు. శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలకు వచ్చే సిఫార్సు లేఖలపై అదనపు ఈవో కార్యాలయంలో టికెట్లను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో గతం ప్రభుత్వంలో సామాన్య భక్తులకు ఇబ్బంది కలిగేలా ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లను కేటాయించారనే విమర్శలు కూడా భారీగానే ఉన్నాయి. ఈక్రమంలో ఇటీవల టీటీడీ అదనపు ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకయ్య చౌదరి ఇప్పటికే టికెట్ల కేటాయింపు అంశంపై దృష్టిసారించారు. ఈక్రమంలో అదనపు ఈవో కార్యాలయంలో చాలా రోజులుగా ఉన్న అధికారులను బదిలీ చేయాలని నిర్ణయించి... సూపరింటెండెంట్లుగా ఉన్న వెంకటరమణారెడ్డి, అజయ్‌లను తిరుపతికి బదిలీ చేశారు. ఆ స్థానాల్లో తులసీప్రసాద్, రామచంద్రను నియమించారు. రానున్న రెండు, మూడువారాల్లో టీటీడీలోని పలువిభాగాల్లో భారీగా బదిలీలు చేయనున్నట్టు సమాచారం.

## విద్యా సామగ్రి పంపిణీ



పాకాల, ఆగస్టు 1: పాకాల ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగులను గురువారం విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు

- ప్రజా సంకల్ప వేదిక -

చంద్రగిరి, ఆగస్టు 1: ప్రభుత్వ స్థలాలు, కాలువ పొరంబోకును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినట్లు ప్రజా సంకల్ప వేదిక తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు ఏల్చూరి చెంగల్రాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 362-2లో కాలువ పొరంబోకు స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టడంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో చంద్రగిరి తహసీల్దారు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దాంతో ఆక్రమణదారులను, రెవెన్యూ అధికారులను ప్రతివాదులుగా చేర్చి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. విచారించిన ధర్మాసనం అధికారుల తీరును తప్పుపట్టినట్లు తెలిపారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీచేసి ఆరువారాల్లో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గత నెల 24వ తేదీన ఆదేశించినట్లు తెలియజేశారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుబ్రహ్మణ్యం, నిషాంత్ మిశ్రా, నరసింహులు

తిరుపతి(విద్య), ఆగస్టు 1: రెండున్నర కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌లు ప్రదానం చేసేందుకు ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించే జాతీయ స్కాలర్‌షిప్ పరీక్ష అంతే-2024కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆకాష్ విద్యా కేంద్రంలో సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ కేఎస్‌ఆర్‌ఎస్ సుబ్రహ్మణ్యం, ఏపీ రీజనల్ సేల్స్ హెడ్ నిషాంత్ మిశ్రా, బ్రాంచ్ హెడ్ మోడెం నరసింహులు మీడియాకు వివరాలు తెలిపారు. 8 నుంచి 12వ తరగతులు చదివే విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్ష అక్టోబరు 19 నుంచి 27వ తేదీ వరకు జరుగుతుందని వెల్లడించారు. 8 నుంచి 9వ తరగతి వరకు 100 మందిని, 11, 12 తరగతులకు కలిపి 50 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించనున్నట్టు చెప్పారు. అమెరికా ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్‌ను సందర్శించేందుకు ఐదు రోజుల పర్యటనను ఐదుగురు విద్యార్థులు గెలుచుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని, ఆన్‌లైన్ విధానంలో ఆకాష్. ఏసీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## అభ్యర్థులను మార్చడం వల్ల ఓడిపోయాం

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి -

తిరుపతి (జీవకోన), ఆగస్టు 1: 'చంద్రబాబు, పవన్‌లు ఎన్నికల్లో వారి సామాజిక వర్గాలను ఓన్ చేసుకున్నారు. జగన్ తన సామాజిక వర్గాన్ని కొంత వరకు పట్టించుకోకపోవడం వల్ల ఎన్నికల్లో నష్టం జరిగింది. ఎన్నికల సమయంలో అభ్యర్థులను మార్చడం కూడా ఓటమికి కొంత కారణం' అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఎక్సైజ్ శాఖ మంత్రిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎలాంటి దర్యాప్తునకు ఆదేశించినా తాను సిద్ధంగా ఉన్నానని.. చంద్రబాబు పెట్టిన బ్రాండ్లనే తాము కొనసాగించామన్నారు. ప్రమోషన్లు, బదిలీల్లో నారాయణ స్వామికి డబ్బులు ఇచ్చామని ఎక్కడ చెప్పినా తాను ఉరేసుకుని చస్తానని అన్నారు.

# మొక్కల పెంపకం ఇలాగేనా?!

● రోడ్డుపైకి విస్తరిస్తున్న ముళ్ల చెట్లు ● ఆందోళనలో వాహన చోదకులు


కరకంబాడి రోడ్డులోని డివైడర్‌లో మోడువారిన చెట్లు, పెరుగుతున్న ముళ్ల కంప చెట్లు, వాహన చోదకులకు తగులుతున్న కాగితపు పూల చెట్లు

తిరుపతి అర్బన్, ఆగస్టు 1: కరకంబాడి రోడ్డు బ్రిడ్జి ర్యాంపు నుంచి తిమ్మనాయుడు పాళెం వరకు డివైడర్‌లో మొక్కల పెంపకాన్ని నగర పాలక సంస్థ అధికారులు గాలికొదిలేశారు. గతంలో తుడా సంరక్షణలో ఉండగా నిర్వహణ బాగుండేది. మూడేళ్ల క్రితం డివైడర్లలో ఉద్యానవన పెంపకం బాధ్యతలను నగరపాలక సంస్థ స్వీకరించింది. అప్పటి నుంచి ఒక్కసారైనా సంరక్షణ చర్యలు చేపట్టలేదు. వేసవిలో మొక్కుబడిగా నీరు పట్టడం మినహా ఇతర సంరక్షణ చర్యలు చేపట్టలేదు. పాత డివైడరన్నీ పాడుబడిపోయాయి. ముళ్ల కంప చెట్లు ఏపుగా పెరిగాయి. కాగితపుపూల మొక్కలను కత్తిరించకపోవడంతో రోడ్డువైపుగా విస్తరించి, వాహనదారులకు తగులుతుండంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్ని చెట్లు ఎండిపోవడంతో అవి ఎప్పుడు కిందపడి ప్రమాదాలకు కారణమవుతాయోనని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో కలుపు మొక్కలు కూడా పెరిగాయి. విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకుంటున్నాయి. అయినా నగరపాలక సంస్థ అధికారులు డివైడర్ల నిర్వహణ గురించి పట్టించుకోవపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా నగర కమిషనర్ స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ గురువారం తిరుపతి నాల్గవ జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి జి.అర్చన తీర్పు చెప్పారు. విజయవాడ గవర్నర్‌పేటకు చెందిన రేపాక లక్ష్మణరావు తిరుపతిలో పగటి పూట భిక్షాటన చేస్తూ.. రాత్రయితే ఎస్వీయూ స్టేషన్ వెనుక ఉన్న బస్సు షెల్టర్‌లో తలదాచుకునేవాడు. 2022 నవంబరు 22వ తేదీన బస్సు షెల్టర్‌లో లక్ష్మణరావు హత్యకు గురైనట్లు వీఆర్వో ఎస్వీయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేయగా, అనంతపురం జిల్లా గుంతకల్ శ్రీలంక కాలనీకి చెందిన ఆర్ముగం మునిరత్నం (గతంలో ఓ కేసులో అరెస్టయి సొంత పూచీకత్తుపై విడుదలయ్యాడు) కూడా ఇదే బస్‌షెల్టర్‌లో ఉండేవాడు. లక్ష్మణరావును సిగరెట్ తాగడానికి అగ్గిపెట్టె అడిగాడు. తాను సిగరెట్ తాగనని, తన వద్ద అగ్గిపెట్టె లేదని చెప్పడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత లక్ష్మణరావు నిద్రిస్తున్న సమయంలో వచ్చి రాయితో తలపై కొట్టి చంపేశాడు. నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు. ఈ కేసు ఛేదనలో కృషి చేసిన దర్యాప్తు అధికారి రవీంద్రనాథ్, సీఐ మురళీమోహన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

## తిరుమలేశుడి సేవలో సుడిగాలి సుధీర్



తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుడిగాలి సుధీర్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఈమేరకు ఆయన ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు.

# నిజాయితీ చాటిన కాంట్రాక్ట్ ఉద్యోగి

## రోడ్డుపై దొరికిన డబ్బు కట్ట అధికారులకు అందజేత



టీటీడీ అధికారికి నగదు అందజేస్తున్న శ్రీనివాసులు

తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని అతిథి గృహంలో పని చేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి నిజాయితీ చాటాడు. రోడ్డుపై తనకు దొరికిన రూ.500 నోట్ల కట్టను అధికారులకు అందజేశాడు. మాగుంట నిలయం అతిథి గృహంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించే కె.శ్రీనివాసులు.. పద్మావతి విచారణ కార్యాలయం నుంచి వెళుతుండగా రోడ్డుపై రూ.500 నోట్ల కట్ట కనిపించింది. వెంటనే ఆ నగదును తీసుకుని పద్మావతి విచారణ కార్యాలయం సూపరిటెండెంట్ కుమారస్వామికి అందజేశాడు. భక్తులు ఎవరో పడేసుకున్నారని, తిరిగి వారికి చేరేలా చర్యలు తీసుకోవాలని కోరాడు. నిజాయితీ చాటిన ఆ ఉద్యోగిని అధికారులు అభినందించారు. నగదు పోగొట్టుకున్న భక్తులు సరైన వివరాలు తెలియజేస్తే తిరిగి నగదును అందజేస్తామని, ఒక వేళ ఎవరూ రాకపోతే స్వామి హుండీకి పంపుతామని అధికారులు తెలిపారు.

# రేపు విదేశీ విద్య, ఉపాధిపై ఉచిత సదస్సు



మాట్లాడుతున్న నరసింహారెడ్డి, శిరీష్ కోమా తదితరులు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 1: నగర పరిధిలోని కెన్సెస్ హోటల్‌లో ఈ నెల 3న గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ 2024పై విదేశీ విద్య, ఉపాధి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ క్యాంపస్ కనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నరసింహారెడ్డి బందర్ల తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివిధ దేశాలకు సంబంధించి దాదాపు 60 యూనివర్సిటీలకు అడ్మిషన్లు ఇస్తామని, చదువుకోవడానికి ఎడ్యుకేషన్ లోన్స్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈసదస్సు జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్లోబ్ హెడ్ శిరీష్ కోమా పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఈఈ, ఏఈలు

తిరుపతి (ఆటో నగర్), ఆగస్టు 1: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని అధికారులను ఎస్ఈ సురేంద్ర నాయుడు ఆదేశించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వున్న ఈఈ, ఏఈ, ఏఏవోలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ డివిజన్ కార్యాలయాల్లో రికార్డులను భద్రపరిచేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయాలను అనతికాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. నెలవారీగా విద్యుత్ బిల్లులను వందశాతం వసూలు చేయాలన్నారు. మొండి బకాయిలు కూడా వసూలు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. తిరుపతి టౌన్, రూరల్ ఈఈలు వాసుదేవరెడ్డి, వాసురెడ్డిలతో పాటు ఏడీఈలు, ఏఈలు, ఏఏవోలు పాల్గొన్నారు.

# శిశువుకు తల్లిపాలు దివ్య ఔషధం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది

తిరుపతి(వైద్యం), ఆగస్టు 1: పుట్టిన శిశువు ఆరోగ్య భవిష్యత్తుకు తల్లిపాలు దివ్య ఔషధమని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతీ తల్లి పుట్టిన తన బిడ్డకు తప్పక తల్లిపాలు అందించాలని డీఎంహెచ్‌వో శ్రీహరి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఆవరణలో గురువారం ప్రసూతి ఆస్పత్రి, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి తల్లిపాల విశిష్టతను వివరిస్తూ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ప్రసూతి ఆస్పత్రి నుంచి స్విమ్స్ సర్కిల్ వరకు ఈ ర్యాలీని కొనసాగించారు. అదేవిధంగా రుయా చిన్నపిల్లల విభాగంలో రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, చిన్నపిల్లల విభాగాధిపతి మనోహర్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం ప్రసూతి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన తల్లిపాల నిధిలో ఎక్కువ పాలను దానం చేసిన తల్లులను ఘనంగా సన్మానించారు. డీపీఎంవో శ్రీనివాసులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ కబ్జా చేసిన ఆటో స్టాండ్‌ను తిరిగి ఇప్పించండి

### కమిషనర్‌ను కోరిన ఆటో యూనియన్ నేతలు



తిరుపతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక విష్ణు నివాసం మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్‌ను గత వైసీపీ ప్రభుత్వం అక్రమంగా మూడు షాపుల పెట్టి కబ్జా చేశారని, వాటిని తొలగించాలని ఆటో యూనియన్ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ మౌర్యను కలిసి వినతిపత్రం అందజేశారు. షాపులు పెట్టి ఆటోలకు స్టాండ్ లేకుండా ఇబ్బంది పెట్టారని, ఇప్పుడైనా వాటిని తొలగించి ఆటోస్టాండ్‌కు అవకాశం కల్పించాలని జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ యాదవ్ కోరారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

PLOT FOR SALE
తిరుపతి జిల్లా అప్పలాయగుంట గ్రామం, ప్రసన్న వెంకటేశ్వర స్వామి గుడి దగ్గరలో (1 నిమిషం వాక్) ఉత్తర ముఖం గల 120 అం. (40x108) సైట్ అమ్మబడును. కావలసినవారు సంప్ర. : 93465 77753
AJT - 187463

CHANGE OF NAME
I, hitherto known as SYED BABAJAN, S/o SHAIK MASTHAN VALI, R/o 5-58-K2-B-1, Apparaothota, Madanapalle, Annamayya District, Andhra Pradesh- 517325, have changed my name and shall hereafter be known as "SHAIK BAVAJAN."
AJT - 4153

PLOT FOR SALE
రంగంపేటలోని మోహన్ బాబు యూనివర్సిటీ ఎదురుగా గల Dollars 15లో తుడా అప్రూవల్ కలిగిన వెంచర్‌లో East Face కలిగిన ప్లాటు అమ్మబడును. సంప్ర. : 9866166111
AJT - 4154

TOLET- బాడుగకు
తిరుపతి నగరం నడిబొడ్డున మాస్క్ రోడ్డు నందు వి.వి. మహల్‌కు ఎదురుగా Commercial Space 2200 చ.అ. మరియు 1St ఫ్లోర్ నందు separate 500 చ.అ. సంప్ర. సెల్: 91105 54556, 96764 01918
AJT-4151

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(పెండ్లిస్ట్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 189294

అమ్మకమునకు - FOR SALE
చంద్రగిరికి సమీపమున వ్యవసాయ క్షేత్రంలో భీమవరం బెస్ట్ బ్రీడ్ జాతి పుంజులు, పెట్టలు, పిల్లల కోళ్ళు అతి సరసమైన ధరలకు అమ్మబడును. సం.ప్ర. సెల్: 91105 54556
AJT-4150

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

# ఎమ్మార్పీఎస్ సంబరాలు



పాల్గొన్న వైకే విశ్వనాథ్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ కోసం సాగిన మూడు దశాబ్దాల పోరాట ఫలితంగానే సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందని ఎమ్మార్పీఎస్ సీనియర్ నేత, న్యాయవాది వైకే విశ్వనాథ్ అభిప్రాయపడ్డారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్వీయూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద గురువారం సంబరాలు చేసుకున్నారు. విశ్వనాథ్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్ల పాటు మాదిగ జాతి గొప్ప పోరాటం చేసి అంతిమ విజయాన్ని సాధించిందన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సీఎం చంద్రబాబు చేసిన కృషిని మరువలేమన్నారు. నాయకులు వెంకటస్వామి, సంగీతం విశ్వనాథ్, గోపీ, వాసుదేవరావు, రాజేంద్ర, అంజన్‌బాబు, మధు, కిషోర్, రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కోదండ రామస్వామికి పవిత్రాల సమర్పణ



తిరుపతి(కల్చరల్), ఆగస్టు 1: తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలలో భాగంగా రెండవరోజు గురువారం పవిత్ర సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం సీతా లక్ష్మణ సమేత రాముల వారికి సుప్రభాతం, తోమాలసేవ, సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులకు యాగశాల లో స్నపన తిరుమంజనం నిర్వహించారు. పవిత్రాలను సమర్పించారు. రాములవారి గుడి ఎదురుగా ఉండే ఆంజనేయస్వామికి కూడా పవిత్రా లు సమర్పించారు. సాయంత్రం సీతారామ లక్ష్మణులు తిరుచ్చిపై ఆల య మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. రాత్రి పవి త్ర ప్రతిష్ఠ, శయనాధివాసం జరిపారు. టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు ఆలయంలో భక్తి సంగీత కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, కంకణభట్టార్ సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ సోమశేఖర్,అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## టీటీడీ అదనపు ఈవోతో కలెక్టర్ భేటీ



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1: టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరిని గురువారం తిరుపతిలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలు అంశాలపై ఇద్దరు చర్చించారు.

# బడిఈడు పిల్లలను చదివించండి



కరపత్రాలు విడుదల చేస్తున్న అధికారులు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 1: జిల్లాలోని 14 ఏళ్ల లోపు పిల్లలను తల్లిదండ్రులు చదివించాలని డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ నాయుడు, కార్మిక శాఖ ఉప కమిషనర్ పీవీ రంగరాజులు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి 30 రోజులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో 14 ఏళ్లలోపు పిల్లలను పాఠశాలలకు పంపే విధంగా తల్లిదండ్రుల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ అంశంపై చురుకుగా గ్రామాల్లో పనిచేయాలని సూచించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీ డిగ్రీ కాలేజీ అధ్యాపక సంఘం నూతన కార్యవర్గం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 1: టీటీడీ డిగ్రీ కాలేజీ అధ్యాపక సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా చలపతి, రామకృష్ణారెడ్డి, కోశాధికారిగా దివ్యవాణి, ఉపాధ్యక్షుడుగా మాదన్న, సంయుక్త కార్యదర్శులుగా విద్యుల్లత, ఉదయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కామేశ్వరరావు, గౌరవాధ్యక్షుడుగా భాస్కరుడు ఎన్నికయ్యారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది.

## ఎస్పీని కలసిన చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1: ఎస్పీ సుబ్బరాయుడిని గురువారం తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కె.మోహన్‌రాజు, కార్యదర్శి వాసుదేవన్, కోశాధికారి అయ్యప్పలు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందచేశారు. మోహన్‌రాజు మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతలు, నేరాల అదుపునకు తమ సంస్థ తరపున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ తిరుపతి భద్రతపై చాంబర్ ఆఫ్ కామర్స్ అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

## ఎన్ఎంఆర్‌ల సంఘం నూతన కార్యవర్గం



జయచంద్రబాబు, సిద్ధయ్య యాదవ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 1: ఎస్వీయూ ఎన్ఎంఆర్‌ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్ష, కార్యదర్శులుగా జయచంద్రబాబు, సిద్ధయ్య యాదవ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జగదీష్ బాబు, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్ఎంఆర్‌లకు టైం స్కేల్ వర్తింప చేసేందుకు ప్రయత్నం చేస్తామని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది. వారిని పలువురు అభినందించారు.

# హోం గార్డులు పోలీసు శాఖలో కీలకం




హోంగార్డుల సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1: హోం గార్డులు పోలీసు శాఖలోని అన్ని విభాగాలకు కీలకమని రాయలసీమ రీజియన్ హోంగార్డుల కమాండెంట్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. తిరుపతి పోలీసు పెరేడ్ మైదానంలో గురువారం జిల్లా హోంగార్డుల పెరేడ్ తనిఖీ, దర్బార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ సుబ్బరాయుడు అధ్యక్షత వహించారు. పెరేడ్ అనంతరం హోంగార్డులను ప్రోత్సహిస్తూ తిరుపతి జిల్లాలో ఇటీవల పదోన్నతి పొందిన 73 మంది హోంగార్డులకు డీఎస్పీ చిరంజీవి వితరణ చేసిన ఆర్టికల్స్‌ను అందజేశారు.కార్యక్రమంలో హోం గార్డుల డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ పోతుల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# రెండో నెలా... అదే సంబరం

## నగరంలో ఒక్కరోజులోనే 98.27 శాతం పింఛన్ల పంపిణీ



స్కావెంజర్స్ కాలనీలో వృద్ధురాలికి పింఛన్ నగదు అందచేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కూటమి నేతలు

తిరుపతి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండో నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం తిరుపతిలో సంబరంలా సాగింది. ప్రతి డివిజన్లోనూ మున్సిపల్ అధికారుల నేతృత్వంలో ఉదయం 5 గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఆయా పరిధిలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకు చేరుకున్నారు. అదేవిధంగా కూటమి నేతలు కూడా పలుచోట్ల పింఛన్ల పంపిణీని పర్యవేక్షించి అవ్వా, తాతలకు అందేలా చూశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కూటమి నేతలతో కలసి స్కావెంజర్స్ కాలనీ, చెన్నారెడ్డి కాలనీలో పింఛన్ల పంపిణీని తనిఖీచేశారు.

**● గత ప్రభుత్వం రూ.వెయ్యి పెంచేందుకు నాలుగేళ్లు సాగదీసింది: ఎమ్మెల్యే ఆరణి**

గత వైసీపీ ప్రభుత్వం రూ.2వేలు ఉన్న పింఛన్‌ను రూ.3వేలు చేసేందుకు నాలుగు సంవత్సరాల పాటు సాగదీసిందని, చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ లబ్ధిదారులకు ఒకేసారి రూ.4వేలు పెంచారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గత మూడు నెలల పెండింగ్‌తో కలిపి రూ.7వేలు తొలి నెలలోనే లబ్ధిదారులకు అందించిన ఎన్డీఏ ప్రభుత్వం పేదల పక్షపాతి అని నిరూపించుకుందన్నారు. పలు డివిజన్లో పింఛన్ల పంపిణీని పరిశీలించిన ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడారు. ఆర్భాటానికి తావు లేకుండా లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఆదేశించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నాయకులు నరసింహ యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్, బీజీ కృష్ణ యాదవ్, మహేష్ యాదవ్, మునిశేఖర్ రాయల్, పుష్పావతి, జనసేన నాయకులు పొలకల మల్లిఖార్జున్, రాజా రెడ్డి, ఆకేపాటి సుభాషిణి, నైనార్ శ్రీనివాసులు, బాబ్జీ, ఆనంద్, రాజేష్ ఆచారి, వెంకటేష్, బాలాజీ, సుధా తదితరులు పాల్గొన్నారు. 36వ డివిజన్లో టీడీపీ నాయకుడు చిత్తూరు రవిశంకర్ యాదవ్, జనసేన అధ్యక్షుడు వినోద్ రాయల్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఆముదాల తులసీరాం, నాయకులు బుజ్జి (జగదీష్), శంకర్ యాదవ్, లత, శేషాద్రి, ఇస్మాయిల్, తిరుమల, సుహాసినిలు పాల్గొన్నారు.

**● 98.27 శాతం పంపిణీ**

నగరంలో 19191 మంది లబ్ధిదారులకు రూ.8,29,96,500 నగదును పంపిణీ చేయాల్సి ఉండగా, రాత్రి 8 గంటల సమయానికి 18,854 మందికి రూ.8,15,64,00 అందించారు. 98.27 శాతం పింఛన్లు తొలిరోజు పంపిణీ చేశారు. మిగిలిన 1.73 శాతం శుక్రవారం అందజేయనున్నట్టు మున్సిపల్ అధికారులు చెప్పారు. కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్థానిక ఇందిరానగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, ఎమ్మార్‌పల్లి, ఐఎస్ మహల్, నెహ్రూ నగర్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. అదేవిధంగా మెప్మా సూపరింటెండెంట్ గాలి సుధాకర్ ఉదయం 5 గంటలకే సచివాలయ సిబ్బందితో కలసి పలుచోట్ల పింఛన్లను పంపిణీ చేశారు.

# నేడు జాబ్ మేళా


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 1: ఎస్వీయూలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. సూర్య ఎలివేషన్స్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్, ఫ్లిప్‌కార్టు ఈ మేళాలో పాల్గొంటాయి. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా గల ఎంప్లాయిమెంట్ ఆఫీసులో మేళా ప్రారంభం కానుంది. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, ఐటీఐ చదువుకున్న వారు అర్హులు. సుమారు 300 ఖాళీల కోసం చేపట్టిన ఈ మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.15వేల చొప్పున వేతనం అందించే అవకాశం ఉంది. ఈ మేరకు వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.

## బదిలీల కోసం 28 మంది ఎంపీడీవోల నిరీక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1: సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా తిరుపతి జిల్లాకు గత ఆరునెలల క్రితం బదిలీపై వచ్చిన 28 మంది ఎంపీడీవోలు తిరిగి పూర్వ జిల్లాలకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే తహసీల్దార్ల బదిలీలు పూర్తయ్యాయి. పొరుగు జిల్లాల నుంచి తిరుపతి జిల్లాకు సంబంధించిన తహసీల్దార్లు మూడు రోజుల క్రితమే బదిలీపై వచ్చారు. వారికికూడా శనివారం కలెక్టర్ పోస్టింగ్ ఇవ్వనున్నారు. అయితే ఎంపీడీవోల విషయంలో స్పష్టత లేదు. జనవరిలో బదిలీపై వచ్చిన, వెళ్లిన ఎంపీడీవోలు తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీ కోసం నిరీక్షిస్తున్నారు. బదిలీ మోడ్‌లోకి అధికారులు వెళ్లడంతో పరిపాలనపై సరిగ్గా దృష్టి పెట్టడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎంపీడీవోల బదిలీలు ఎంత త్వరగా పూర్తిచేస్తే అంత బాగుంటుందని జిల్లా అధికారులు అంటున్నారు.పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ వద్ద ఎంపీడీవోల బదిలీ ఫైల్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

## అన్నదానం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 1: దేవదాయ శాఖ మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత స్వర్గీయ పైడికొండల మాణిక్యాలరావు నాల్గవ వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు గురువారు స్థానిక గోవిందరాజస్వామి దక్షిణ మాడ వీధిలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, మల్లారపు రవిప్రసాద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, జయంత్‌కుమార్, రామిరెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.






## 15 నాటికి అన్న క్యాంటీన్ ప్రారంభం : కలెక్టర్

వెంకటగిరి, ఆగస్టు 1: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15వ తేది నాటికి అన్న క్యాంటీన్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం వెంకటగిరికి విచ్చేసిన ఆయన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి అన్న క్యాంటీన్ పనులకు పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం విశ్వోదయ క్రీడా ప్రాంగణంలో వివాదాస్పదంగా ఉన్న స్థలాలను పరిశీలించడంతోపాటు పాపమాంబాపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ తనూజా, టీడీపీ నాయకులు మదునాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, జీకేపల్లి బాబు నాయుడు, రాహూరు శ్రీనివాసులు, కొల్లాపూరు సుధ, చెంగారావు, మగ్గం వెంకటాచలం తదితరులు ఉన్నారు.

## జగనన్న కాలనీలో వైసీపీ నేత అక్రమాలు


అక్రమ కట్టడం గోదాము వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు

వాకాడు, ఆగస్టు 1 : రావిగుంట పాళెంలోని జగనన్న కాలనీలో గిరిజన కుటుంబానికి చెందిన మాణికల రామయ్యకి ఇచ్చిన స్థలంలో వైసీపీ కీలకనేత గోదాము నిర్మాణాన్ని చేపట్టడంతో టీడీపీ నేతలు గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు ఇంగిలాల బుజగేంద్ర మాట్లాడుతూ మాణికల రామయ్యకు నిర్ధేశించిన స్థలంలో వైసీపీ నేత గోదాము నిర్మాణాన్ని చేపట్టాడని తెలిపారు. రామయ్య ఇంటి నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం ఇచ్చిన రూ 1.80 లక్షలు వైసీపీ నేతే తీసుకొని తన సొంత గోదాము నిర్మాణాన్ని హౌసింగ్, రెవెన్యూ అధికారుల సహకారంతో నిర్మించుకున్నాడని తెలిపారు. లబ్ధిదారుడు రామయ్య నేటికి గుడిసెలోనే జీవనం సాగిస్తున్నాడని, అధికారుల వైసీపీ నేత అక్రమాలపై చర్యలు చేపట్టి మాణికల రామయ్యకి పక్కాగృహాన్ని ఇవ్వాలన్నారు. శాలివాహన డైరెక్టర్ కోట శ్రీనివాసులు, వాకాటి విజయభాస్కర్‌రెడ్డి, జమీందర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో మాబాకకు ఆర్టీసీ బస్సు

నాయుడుపేట టౌన్,ఆగస్టు1: సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చొరవతో మాబాక గ్రామానికి ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. గురువారం గ్రామానికి చేరుకున్న ఆర్టీసీ బస్సు వద్ద టీడీపీ నాయకులు గుండ్లూరు దయాకర్‌నాయుడు గ్రామస్తులతో కలసి ఆర్టీసీ సిబ్బందికి మిఠాయిలను అందజేశారు. దయాకర్‌నాయుడు మాట్లాడుతూ శ్రీకాళహస్తి నుంచి మాబాక మీదుగా ఆర్టీసీ బస్సు నాయుడుపేటకు చేరుకుంటుందని, దీంతో మాబాక గ్రామస్తులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. మాబాక గ్రామస్తులు వెంకటేశ్వర్లుగౌడ్, ప్రసాద్‌నాయుడు, బాబునాయుడు, వినోద్, సాయి, అశోక్, చాందు, వెంకటయ్య, సిద్దయ్య పాల్గొన్నారు.

## హోటళ్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడులు

సూళ్లూరుపేట, ఆగస్టు 1: పట్టణంలో హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, స్వీట్లు తయారు చేసే దుకాణాలపై గురువారం జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.మద్దులేటి మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్‌తో కలిసి దాడులు చేశారు. హైవేపై కోటపోలూరు క్రాస్ వద్దనున్న డాబా, పక్కనే ఉన్న మరో హోటల్ లో వండిన వంటలు, ఆహార పదార్థాలు తనిఖీ చేసి నిల్వచేసిన ఆహార పదార్థాలను వినియోగిస్తే చర్యలు తీసుకొంటామన్నారు. అనంతరం పట్టణంలో స్వీట్లు, తినుబండరాలు తయారు చేసే దుకాణాలతోపాటు పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను తనిఖీ చేసి వారి వద్దనున్న ఆహార పదార్థాలు, వాటిని వినియోగించే ఆయిల్, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించాలని, నిల్వచేసిన ఆహార పదార్థాలను వినియోగిస్తే చర్యలు తీసుకొంటామన్నారు.

## బదిలీల కోసం 28 మంది ఎంపీడీవోల నిరీక్షణ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 1: సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా తిరుపతి జిల్లాకు గత ఆరునెలల క్రితం బదిలీపై వచ్చిన 28 మంది ఎంపీడీవోలు తిరిగి పూర్వ జిల్లాలకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే తహసీల్దార్ల బదిలీలు పూర్తయ్యాయి. పొరుగు జిల్లాల నుంచి తిరుపతి జిల్లాకు సంబంధించిన తహసీల్దార్లు మూడు రోజుల క్రితమే బదిలీపై వచ్చారు. వారికికూడా శనివారం కలెక్టర్ పోస్టింగ్ ఇవ్వనున్నారు. అయితే ఎంపీడీవోల విషయంలో స్పష్టత లేదు. జనవరిలో బదిలీపై వచ్చిన, వెళ్లిన ఎంపీడీవోలు తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీ కోసం నిరీక్షిస్తున్నారు. బదిలీ మోడ్‌లోకి అధికారులు వెళ్లడంతో పరిపాలనపై సరిగ్గా దృష్టి పెట్టడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎంపీడీవోల బదిలీలు ఎంత త్వరగా పూర్తిచేస్తే అంత బాగుంటుందని జిల్లా అధికారులు అంటున్నారు.పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ వద్ద ఎంపీడీవోల బదిలీ ఫైల్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

## టీటీడీ వీఎస్వోగా రాంకుమార్ బాధ్యతల స్వీకారం



తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీ విజిలెన్స్ వింగ్ వీఎస్వోగా రాంకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన వింగ్ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు తీసుకున్నారు. నూతన వీఎస్వోకు పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## టీటీడీ కల్యాణకట్ట డిప్యూటీఈవోగా వెంకటయ్య

టీటీడీలో పలువురు డిప్యూటీఈవోలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలో డిప్యూటీఈవోగా ఉన్న వెంకటయ్యను తిరుమల కల్యాణకట్ట డిప్యూటీఈవోగా బదిలీ చేశారు. ప్రస్తుతం కల్యాణకట్ట డిప్యూటీఈవోగా ఉన్న సెల్వంను తిరుపతికి బదిలీ చేశారు. అలాగే రిసెప్షన్ డిప్యూటీఈవో1గా హరీంద్రనాథ్‌ను ఆర్2గా నియమించగా, ఆస్థానంలో ఆర్2గా ఉన్న భాస్కర్‌ను మార్చారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవోగా కూడా మార్పు చేయాలని ఉన్నతాధికారులు భావించినప్పటికీ కొన్ని ఇబ్బందుల వల్ల వాయిదా వేసినట్టు సమాచారం.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఈఈలు, ఏఈలు

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 1: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని అధికారులను ఎస్ఈ సురేంద్ర నాయుడు ఆదేశించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వున్న ఈఈలు, ఏఈలు, ఏఏవోలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ డివిజన్ కార్యాలయాల్లో రికార్డులను భద్రపరిచేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయాలను అనతికాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. నెలవారీగా విద్యుత్ బిల్లులను వందశాతం వసూలు చేయాలన్నారు. మొండి బకాయిలు కూడా వసూలు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి టౌన్, రూరల్ ఈఈలు వాసుదేవరెడ్డి, వాసురెడ్డిలతోపాటు ఏడీఈలు, ఏఈలు, ఏఏవోలు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ గురువారం తిరుపతి నాల్గవ జిల్లా అదనపు కోర్టు న్యాయమూర్తి జి.అర్చన తీర్పు చెప్పారు. విజయవాడ గవర్నర్‌పేటకు చెందిన రేపాక లక్ష్మణరావు తిరుపతిలో పగటి పూట భిక్షాటన చేస్తూ.. రాత్రయితే ఎస్వీయూ స్టేషన్ వెనుక ఉన్న బస్సు షెల్టర్‌లో తలదాచుకునేవాడు. 2022 నవంబరు 22వ తేదీన బస్సు షెల్టర్‌లో లక్ష్మణరావు హత్యకు గురైనట్లు వీఆర్వో ఎస్వీయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేయగా, అనంతపురం జిల్లా గుంతకల్ శ్రీలంక కాలనీకి చెందిన ఆర్ముగం మునిరత్నం (గతంలో ఓ కేసులో అరెస్టయి సొంత పూచీకత్తుపై విడుదలయ్యాడు) కూడా ఇదే బస్‌షెల్టర్‌లో ఉండేవాడు. లక్ష్మణరావును సిగరెట్ తాగడానికి అగ్గిపెట్టె అడిగాడు. తాను సిగరెట్ తాగనని, తన వద్ద అగ్గిపెట్టె లేదని చెప్పడంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత లక్ష్మణరావు నిద్రిస్తున్న సమయంలో వచ్చి రాయితో తలపై కొట్టి చంపేశాడు. నేరం రుజువు కావడంతో నిందితుడికి న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు. ఈ కేసు ఛేదనలో కృషి చేసిన దర్యాప్తు అధికారి రవీంద్రనాథ్, సీఐ మురళీమోహన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయలక్ష్మి, కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

# గూడూరు

### సూళ్లూరుపేట/వెంకటగిరి

## సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

తడ,ఆగస్టు1: మండలంలోని కొండూరు పంచాయతీలో రూ.10 లక్షలతో గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 50 రోజులకే రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయడం తెలుగుదేశం పార్టీకి అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, వేనాటి రాజారెడ్డి, రవి, శ్యామసుందర్‌రెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.

## మేరీ వృద్ధాశ్రమానికి చేయూత



నాయుడుపేట, ఆగస్టు 1 : నాయుడుపేటలోని మేరీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం అరబిందో ఉద్యోగి సుదర్శన్‌రెడ్డి ఆయన తల్లి రాజేశ్వరి 4వ వర్ధంతి సందర్భంగా దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే మధ్యాహ్నం వృద్ధులకు భోజనాన్ని అందజేశారు. మేరీ వృద్ధాశ్రమం రేకులతో ఉండటంతో శ్లాబుకోసం తన శక్తిమేర చేయూత అందిస్తామన్నారు. ఆశ్రమంలోని వృద్ధులను ఆదరిస్తున్న సునీత జెస్సీలను ప్రత్యేకంగా అభినందించారు.

## తాగునీటి పథకం ప్రారంభం

నాయుడుపేట, ఆగస్టు 1 :నాయుడుపేట కొత్త బీడీ కాలనీలో గురువారం రూ.5 లక్షలతో తాగునీటి పథకాన్ని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం టీడీపీ నాయకులతో కలసి ప్రారంభించారు. ఇటీవల బీడీకాలనీలో తాగునీటి సమస్య తలెత్తడంతో స్థానికులు ఎమ్మెల్యే విజయశ్రీ దృష్టికి తీసుకురావడంతో తక్షణమే బోరు వేసి తాగునీటి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జనార్దన్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎస్‌కె రఫీ, దేవారెడ్డి నాగేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, పసల చెంగయ్య, నానాబాల సుబ్బారావు, బిరదవాడ నారాయణ, రవి, ధనంజయ తదితరులు ఉన్నారు.

## క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



నాయుడుపేట, ఆగస్టు 1 : నాయుడుపేట మండలం పుదూరులో గురువారం తిరుపతి సిమ్స్ వైద్య బృందంచే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇటీవల కాలంలో క్యాన్సర్ ప్రబలుతుండటం, వాటిని ప్రజలు గుర్తించలేకపోవడంతో క్యాన్సర్ వ్యాధి తీవ్రత పెరుగుతోందని సిమ్స్ వైద్యాధికారిణి స్రవంతి అన్నారు. సహజంగా 30 సంవత్సరాలు పైబడిన వారికి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రధానంగా నోరు, రొమ్ముభాగం, గర్భాశయం, టెస్టికల్స్‌లలో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. నేటి ఆహారపు అలవాట్లు ఓ కారణం అవుతుందన్నారు. రోగులను పరీక్షించి ప్రాథమికంగా క్యాన్సర్ లక్షణాలు ఉంటే వారిని తిరుపతి సిమ్స్‌లో క్షుణ్ణంగా పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేస్తామన్నారు. అలాగే బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వికాస్, డాక్టర్ శంకరయ్య, ఎంపీపీ ధనలక్ష్మి, సర్పంచ్ సుమతి తదితరులు ఉన్నారు.

## చెంగాళమ్మ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా శ్రీనివాస బాబు



సూళ్లూరుపేట, ఆగస్టు 1: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా గురువారం శ్రీనివాస బాబు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సహాయ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. దీంతో గూడూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ బాబును చెంగాళమ్మ ఆలయ ఇన్‌చార్జి ఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించారు.

## ఎస్‌ఎంసీ ఎన్నికలపై శిక్షణ

దొరవారిసత్రం, ఆగస్టు 1 : ప్రభుత్వ పాఠశాలల ఎస్ఎంసీ కమిటీల ఎన్నికలపై గురువారం ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. స్థానిక ఏకొల్లు ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖాధికారులు మునిశేఖర్, క్రిష్ణయ్యలు ప్రధానోపాధ్యాయులకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ నెల 8వ తేది ఎన్నికలు నిర్వహించేలా ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

## అంతర్గత ఆడిట్ తనిఖీలు

కోట, ఆగస్టు 1 : కోటలోని వెలుగు కార్యాలయంలో గురువారం అంతర్గత ఆడిట్ జరిగింది. సీసీలు కృష్ణ, శ్రీకాంత్, ప్రసాద్, కృష్ణమ్మ, భాస్కర్, శంకరయ్యల ఆధ్వర్యంలో మండలంలోని 21 పంచాయతీలలో ఉన్న సంఘ బంధాల లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. వీవోఏల పర్యవేక్షణలో ఆయా సంఘ బంధాలకు పలు రకాల రుణాలు ఇచ్చారు. రెండు రోజుల్లో ఆయా లావాదేవీలకు సంబంధించి అంతర్గత ఆడిట్ జరుగనున్న నేపథ్యంలో సీసీలు ఆయా రికార్డులను తనిఖీలు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

కోట, ఆగస్టు1:తల్లిపాల ప్రాముఖ్యత గురించి తెలుసుకోవాలని సీడీపీవో మునికుమారి కోరారు. పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. వారం రోజులపాటు జరిగే ఈ వారోత్సవాలను సీడీపీవో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. డబ్బాపాలు వద్దు... ముర్రుపాలే ముద్దు అంటూ తల్లులు, గర్భిణులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, కృష్ణమ్మ, అంగన్‌వాడీ వర్కర్ పెంచలమ్మ, తదితరులు ఉన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

డక్కిలి, ఆగస్టు 1 : తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని స్థానిక వైద్యాధికారి శ్రీహరి అన్నారు. గురువారం డక్కిలిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కలిసి తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముర్రుపాలల్లో రోగనిరోధక శక్తి అధికంగా వుంటుందన్నారు.తల్లిపాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.



# ఆల్తూరుపాడు రిజర్వాయరు పరిశీలన

**సమస్యను సీఎంకు నివేదించనున్న కలెక్టరు ● నిర్మాణంలో అడ్డంకులు తొలగించేందుకు చర్యలు**


ఆగిన రిజర్వాయరు పనులకు పరిశీలిస్తున్న కలెక్టర్

డక్కిలి, ఆగస్టు 1 : డక్కిలి మండలంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను గురువారం కలెక్టర్ వెంకటేశ్ తెలుగుగంగ ఇంజనీర్ల బృందంతో కలిసి పర్యవేక్షించారు. రెండు రోజుల క్రితం కలెక్టర్ తన కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్తూరుపాడు రిజర్వాయర్ ఎందుకు ఆగింది అన్న దానిపై చర్చ జరిగింది. ఈ మేరకు ఆయన ఆగిపోయిన ఆల్తూరుపాడు రిజర్వాయర్‌ను గురువారం పరిశీలించడం ప్రాధాన్యతను సంతరించుకొంది. ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురైన అడ్డంకులను ఆయన తెలుగుగంగ ఎస్ఈ మదన్‌గోపాల్,ఈఈ రాధాకృష్ణలను అడిగి తెలుసుకున్నారు. సోమశిల-స్వర్ణముఖి బ్యాలెన్ రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో భాగంగా 2019లో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, తర్వాత రీటెండరు పేరుతో 27శాతం లెస్‌తో పనులు దక్కించుకొన్న కాంట్రాక్టరు పనులు పూర్తి చేయకుండా మధ్యలోనే వదిలి పెట్టి వెళ్లినట్లు తెలుగుగంగ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు వచ్చారు. అప్పట్లో రిజర్వాయరుకు అవసరమైన 50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించడం పెద్ద కష్టతరంగా మారడంతోనే కాంట్రాక్టరు పనులు ఆపేయాల్సి వచ్చిందని వివరించారు. రిజర్వాయరు కట్టకు అవసమైన మట్టిని ఈ దఫా ఒకే ప్రాంతం నుంచి కాకుండా డక్కిలి, వెంకటగిరి, బాలాయపల్లి మండలాల్లోని చెరువులను గుర్తించడం జరిగిందని వారు కలెక్టరుకు వివరించారు. అంతే కాకుండా రిజర్వాయర్ లోపల బాగంగలో 29 హెక్టార్ల అటవీ శాఖకు సంబంధించిన భూమి ఉన్నందున రిజర్వాయర్ నిర్మాణంలో కొంత అడ్డంకి ఎదురైందని చెప్పారు. అటవీ అధికారులకు ప్రత్యామ్నాయంగా భూములు కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ రిజర్వాయరు నిర్మాణం పూర్తి అయితే వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో సుమారు 80 వేల ఎకరాల్లో సాగు భూములకు సాగునీరు అందుతుందని కలెక్టర్ చెప్పారు. అంతే కాదు. ఏర్పేడు మండలం మేదర్లపాడు వరకు 70 శాతం పనులు పూర్తి కావస్తున్నాయని చెప్పారు. అక్కడి నుంచి మల్లెమడుగు రిజర్వాయరులోకి పంప్ చేసి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా తిరుపతి నగర ప్రజలకు దాహార్తి కోసం ఈ నీటిని వినియోగిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 1.50 లక్ష మంది ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. ఇంతటి ప్రాద్యానతగల ఈ ప్రాజెక్టు సంబంధించి పూర్తి స్థాయి నివేదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఈ ప్రాజెక్టు పనులు మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కాగా ఆల్తూరుపాడు రిజర్వాయరు సందర్శనకు వచ్చిన కలెక్టర్ వెంకటేశ్‌ను ఆల్తూరుపాడు వెల్లంపల్లి గ్రామ రైతులు కలిశారు. తాము గత 30 ఏళ్ళుగా సాగు చేసుకొంటున్న భూములు రిజార్వయర్‌లో పోవడంతో తాము జీవనోపాధి కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు పట్టాలు లేనందున తమకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదని వారు వాపోయారు. తమకు నష్టపరిహారం ఇప్పించాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టరు భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఇంటిని మరిపించేలా భోజనం ఉండాలి

● కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరిటౌన్, ఆగస్టు1: పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే అన్నం ఇంటిని మరిపించేలా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సాంబారన్నంలో ఉప్పు ఎక్కువగా ఉందని, అనం కూడా కాస్త ఉడికించాలన్నారు. పుస్తకాలు, యూనిఫాం, షూ అందాయా అని ఎంఈవో, ప్రధానోపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో భోజనం కన్నా, భోధన బాగా ఉందన్నారు. పదోతరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మొక్కలు నాటారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఆయన కలవలపూడి, పాపమాంబపురంలో జరుగుతున్న అమృత సరోవర్ ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతిఒక్కరికి ఉపాధిపని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అమృత సరోవర్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ప్రేమ్‌కుమార్, దీప తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్నం భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

# సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా ఆగవు : నెలవల



పెన్షన్‌ను అందజేస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ

పెళ్లకూరు, ఆగస్టు 1 : ఎన్నికల సమయంలో టీడీపీ ప్రజలకు ఇచ్చిన హామీలలో భాగమైన సూపర్ సిక్స్‌లోని సంక్షేమ పథకాలన్నింటినీ ముఖ్యమంత్రి చంద్రబాబు కచ్చితంగా అమలు చేస్తారని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం తాళ్వాయిపాడులో జరిగిన సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేదల కోసం సంక్షేమ పథకాలను తీసుకొచ్చింది తెలుగుదేశం పార్టీయేనని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ నాయకులు ఎన్నో కుయుక్తులను పన్నుతున్నారని ఆరోపించారు. ఒక్క సూళ్లూరుపేట నియోజకవర్గంలోనే 39332 మందికి రూ.16,85,79,000 పెన్షన్ నగదును అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి, దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట టౌన్** : పట్టణంలోని జైహింద్ కాలనీలో గురువారం ఉదయం జరిగిన పింఛన్ల పంపిణీలో టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఆయన వెంట కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తదితరులు ఉన్నారు.

**ఓజిలి** : ఓజిలి మండలంలోని 5609 మందికి వివిధ పింఛన్ల కింద 2.37 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బందితోపాటు ఇతర శాఖల అధికారులు కూడా ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని పున్నేపల్లిలో మండల టీడీపీ కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పింఛన్లు అందజేశారు.

**దొరవారిసత్రం** : మండలంలోని తల్లంపాడు, అక్కరపాక గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో కలసి ఎమ్మెల్యే విజయశ్రీ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆమె వెంట మండల టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, అధికారులు ఉన్నారు. మండలంలో గురువారం 97.73శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

**సూళ్లూరుపేట:** టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పట్టణంలోని సాయి వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు పింఛన్లతోపాటు దాతల సాయంతో చీరలు, పండ్లు అందజేశారు. అనంతరం కుదిరి, కేసియన్ గుంట గ్రామాల్లో పింఛన్లు అందజేశారు.

**తడ** : కొండూరు, చేనిగుంట పంచాయతీలలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఇంచుమించుగా పింఛన్ల పంపిణీ పూర్తి అయిందని, మిగిలిన కొద్ది మందికి శుక్రవారం ఉదయంకల్లా పంపిణీ చేస్తామని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ సంబరాలు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు మేరకు పాత బస్టాండ్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. గురువారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ సుప్రీంకోర్టు ఇన్‌చార్జి రవి, నాయకులు వాసు, శ్రీనివాసులు, శివ, రవి, హజరత్, శ్రీనివాసులు, వీరరాఘవులు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సానుకూల స్పందనతో హర్షం

చిల్లకూరు : ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం హర్షనీయమని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చీమల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటాలు సాగిస్తున్నామని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షనీయం

కోట : ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘ పోరాటంలో మాదిగలు సుప్రీంకోర్టు ఆదేశాలతో ఒక మెట్టు ఎక్కినట్లు అయ్యిందని సమైక్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు నాగేంద్ర అన్నారు. అనంతరం శ్యామసుందరపురంలో బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి వెంకటేశ్వర్లు, యల్లశిరి మాతయ్య, పట్టపు పెంచలయ్య, మాతయ్య, చెరుకూరి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

## టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో బదిలీలు

తిరుమల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): టీటీడీలోని ఇంజనీరింగ్ విభాగంలోని పలువురు అధికారులను బదిలీ చేస్తూ గురువారం టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు ఉత్వర్వులు జారీ చేశారు. ఇందులో.. ఎస్ఈ-2గా తిరుమలలో విధులు నిర్వహిస్తున్న జగదీశ్వర్‌రెడ్డిని ఎస్ఈ-3గా తిరుపతికి బదిలీ చేశారు. ఇక, సీనియార్టీ ప్రకారం చీఫ్ ఇంజనీరింగ్ పోస్టు తనకే రావాలంటూ హైకోర్టు ద్వారా పోరాటం చేస్తున్న ఎస్ఈ-3 సత్యనారాయణను ఎస్ఈ-2గా నియమించారు. అలాగే తిరుమలలో ఈఈగా ఉన్న శ్రీహరిని తిరుపతి పరిపాలన భవనంలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. ఆపోస్టులో ఉన్న సుబ్రహ్మణ్యంను ఈఈ1గా తిరుమలకు బదిలీ చేశారు. ఈఈ1గా ఉన్న జగన్మోహన్ రెడ్డిని XIVగా తిరుపతికి బదిలీ చేశారు. ఆస్థానంలో ఉన్న వేణుగోపాల్ ఈఈ5గా తిరుమలకు బదిలీ అయ్యారు. ఈఈ5గా ఉన్న సురేంద్రనాథరెడ్డిని విజయవాడకు బదిలీ చేశారు. విజయవాడలోని సుధాకర్‌ను వాటర్‌వర్క్స్ ఈఈ9గా తిరుమలకు బదిలీ చేశారు. అలాగే తిరుమల ఎలక్ట్రికల్ డీఈగా ఉన్న రవిశంకర్‌రెడ్డిని ఎలక్ట్రికల్1గా తిరుపతికి బదిలీ చేశారు. ఆస్థానంలో ఉన్న చంద్రశేఖర్ తిరుమల ఎలక్ట్రికల్ డీఈగా బదిలీ చేశారు. గతం వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో భారీగా అక్రమాలు జరిగాయని విమర్శలు వచ్చిన నేపథ్యంలో తాజా బదిలీలు చర్చనీయాశంగా మారాయి.

### అదనపు ఈవో కార్యాలయం సూపరింటెండెంట్లు బదిలీ

తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయంలోని ఇద్దరు సూపరింటెండెంట్లు బదిలీ అయ్యారు. శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలకు వచ్చే సిఫార్సు లేఖలపై అదనపు ఈవో కార్యాలయంలో టికెట్లను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. గత ప్రభుత్వంలో సామాన్య భక్తులకు ఇబ్బంది కలిగేలా ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లను కేటాయించారనే విమర్శలు కూడా భారీగానే ఉన్నాయి. ఈక్రమంలో ఇటీవల టీటీడీ అదనపు ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకయ్య చౌదరి ఇప్పటికే టికెట్ల కేటాయింపు అంశంపై దృష్టిసారించారు. ఈక్రమంలో అదనపు ఈవో కార్యాలయంలో చాలా రోజులుగా ఉన్న అధికారులను బదిలీ చేయాలని నిర్ణయించి... సూపరింటెండెంట్లుగా ఉన్న వెంకటరమణారెడ్డి, అజయ్‌లను తిరుపతికి బదిలీ చేశారు. ఆ స్థానాల్లో తులసీప్రసాద్, రామచంద్రను నియమించారు. రానున్న రెండు, మూడువారాల్లో టీటీడీలోని పలువిభాగాల్లో భారీగా బదిలీలు చేయనున్నట్టు సమాచారం.

## హోం గార్డులు పోలీసు శాఖలో కీలకం

కమాండెంట్ మహేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న మహేష్‌కుమార్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 1: హోం గార్డులు పోలీసు శాఖలోని అన్ని విభాగాలకు కీలకమని రాయలసీమ రీజియన్ హోంగార్డుల కమాండెంట్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. తిరుపతి పోలీసు పెరేడ్ మైదానంలో గురువారం జిల్లా హోంగార్డుల పెరేడ్ తనిఖీ, దర్బార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ సుబ్బరాయుడు అధ్యక్షత వహించారు. పెరేడ్ అనంతరం హోంగార్డులను ప్రోత్సహిస్తూ తిరుపతి జిల్లాలో ఇటీవల పదోన్నతి పొందిన 73 మంది హోంగార్డులకు డీఎస్పీ చిరంజీవి వితరణ చేసిన ఆర్టికల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డుల డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ పోతుల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేదోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం మేధో గురు దక్షిణామూర్తికి వేదోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ ఏర్పాటు అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి, ఆగస్టు 1: స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో జనసేన ఆధ్వర్యంలో మూడవ వారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత హాజరై సుమారు 500మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీర మహిళలు శారద, గాయత్రి, నిర్మల, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హోం గార్డులకు పదోన్నతులు సంతోషకరం



ప్రశంసాపత్రం అందుకుంటున్న హోంగార్డు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1: తిరుపతి లోని ఏఆర్ గ్రౌండ్స్‌లో ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గురువారం హోంగార్డు దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు హోంగార్డులు మాట్లాడుతూ 74మంది హోంగార్డులకు ప్రభుత్వం కంపెనీ కమాండర్, ప్లాటూన్ కమాండర్, సెక్షన్ కమాండర్, అసిస్టెంట్ సెక్షన్ కమాండర్లుగా ఉద్యోగోన్నతి కల్పించిందన్నారు. వారు ప్రభుత్వానికి, కృతజ్ఞతలు తెలిపారు. హోంగార్డులు సతీష్, మోహన్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, హేమకుమార్, చార్లెస్, సాయి శ్రీనివాసులు, చెంచుప్రతాప్ పాల్గొన్నారు.

## మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ



టైలరింగ్ శిక్షణలో రాస్ అధికారులు, మహిళలు

ఏర్పేడు, ఆగస్టు 1: రాస్ మహిళా భారతి పాపానాయుడుపేట శాఖ, జనశిక్షణ సంస్థాన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కందాడు, సదాశివపురం గ్రామాల్లో ఉచితంగా టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాస్ మహిళా భారతి ప్రాజెక్టు అధికారి బాలాజీరెడ్డి మాట్లాడుతూ వంద రోజుల్లో రోజుకు మూడు గంటలు చొప్పున టైలరింగ్ శిక్షణ నేర్చుకుని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చన్నారు. నేర్చుకున్నాక వీరికి రాస్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. జనశిక్షణ సంస్థాన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ హరిబాబు మాట్లాడుతూ కేంద్ర నైపుణ్య అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహకారంతో శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లస్టర్ లీడర్ కాంతమ్మ, క్షేత్ర సహాయాధికారి వెంకటకుమార్, సమాచార నిర్వహణ విభాగ అధికారి ముని పార్థసారథి, క్షేత్రస్థాయి సహాయ అధికారులు కృష్ణవేణి, సుమలత, శిక్షకురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాల సందర్శన



మాట్లాడుతున్న వైద్యాధికారులు

వరదయ్యపాళెం, ఆగస్టు1: వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ లెప్రసీ కేస్ డిటెక్టర్, క్యాంపెయిన్(ఎల్‌సీడీసీ) గురించి వివరించారు. వరదయ్యపాళెం,చిన్నపాండూరు ఆరోగ్యకేంద్రాలను సందర్శించి సీజనల్ వ్యాధులు అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీపీఎంవో వెంకటరమణ, అధికారులు కిరణ్‌కుమార్, డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ ద్వైత, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతమ్మ, సీహెచ్‌వో మధుసూదన్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు బీఎస్ఎన్ఎల్ సిమ్ మేళా

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 1: స్థానిక బస్టాండ్ ఆవరణలో శుక్రవారం సిమ్ మేళా జరుగుతుందని బీఎస్ఎన్ఎల్ అధికారి తెలిపారు. 3జీ సిమ్ నుంచి 4జీ సిమ్‌కు మారడానికి, బీఎస్ఎన్ఎల్ కొత్త సిమ్‌లు తీసుకోడానికి, ఇతర నెట్‌వర్క్ నుంచి బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కు మారడానికి ఇందులో అవకాశం కల్పిస్తున్నామన్నారు.

## చంద్రబాబుతో ఏర్పేడుకు మహర్దశ: సుధీర్



పాఠశాల ప్రతినిధులతో ఎమ్మెల్యే సుధీర్

ఏర్పేడు, ఆగస్టు 1: చంద్రబాబు, నాటి ఐటీ మంత్రి లోకేష్ హయాంలో 2014-2019లోనే పలు పరిశ్రమలు ఏర్పాటు చేయించి ఏర్పేడు మండలానికి మహర్దశ తీసుకువచ్చారని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. వికృతమాల వద్ద గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాల నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకల్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం భూసేకరణ చేసిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు డాలర్స్ దివాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హేమాక్షి, నాయకులు చెంచయ్యనాయుడు, లక్కమనేని మధు, సామ అంకయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి

## సత్యవేడు

## ముక్కంటి సేవలో సుడిగాలి సుధీర్



శ్రీకాళహస్తి, ఆగస్టు 1: శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం జబర్దస్త్ ఫేం హీరో సుడిగాలి సుధీర్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అదనపు కట్నం కోసం వేధింపులు

ఏర్పేడు, ఆగస్టు 1: అదనపు కట్నం తేవాలని అత్తింటివారు వేధించారని ఓ మహిళ గురువారం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు ముసలిపేడు దళితవాడకు చెందిన ప్రసన్నకు రెండేళ్ల క్రితం మంగళంకు చెందిన తారక రామన్‌తో పెళ్లి చేశారు. ఆరు నెలలుగా ప్రసన్నను అదనపు కట్నం తేవాలని భర్త తారకరామన్‌తో పాటు అత్తమామలు వేధిస్తున్నారు. దీంతో ఆమె రెండు మాసాలుగా పుట్టింట్లో ఉంటోంది. గురువారం ప్రసన్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త తారకరామన్‌తో పాటు మామ సుబ్రహ్మణ్యం, అత్త చిట్టెమ్మపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



ఏర్పేడు, ఆగస్టు 1: పాపానాయుడుపేట జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం ప్రభుత్వ పుస్తకాలు, బ్యాగులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటసుబ్బమ్మ, గ్రంథాలయ అధికారి సోమశేకర్‌బాబు అందించారు. అధ్యాపకులు ఉమ, రాఘవరెడ్డి, వెంకట సురేష్, జలగం రామాంజులు, నాదెండ్ల శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

## అమరావతి అభివృద్ధికి దివ్యాంగుని దాతృత్వం



పింఛను నగదును సుధీర్‌రెడ్డికి అందజేస్తున్న షబ్బీర్

శ్రీకాళహస్తి, ఆగస్టు 1: రాజధాని అమరావతి అభివృద్ధికి ఓ దివ్యాంగుడు దాతృత్వాన్ని చాటుకున్నాడు. స్థానిక దర్గామిట్టకు చెందిన షబ్బీర్ బాషా గురువారం తన పింఛను మొత్తం రూ.6వేలు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి అందజేశాడు. రాష్ట్రానికి రాజధాని అవసరమన్న ఆకాంక్షతో పింఛను విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించాడు. షబ్బీర్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

## టీడీపీ సానుభూతిపరుడిపై వైసీపీ వర్గీయుల దాడి

శ్రీకాళహస్తి, ఆగస్టు 1:వైసీపీ వర్గీయుల దాడిలో టీడీపీ సానుభూతిపరుడు గాయపడ్డాడు. బాధితుని కథనం మేరకు వేడాం బీసీకాలనీకి చెందిన దివ్యాంగుడు ఏడుకొండలు కూలీపనులు చేస్తుంటాడు. వైసీపీకి చెందిన ఇద్దరు యువకులతో ఇతనికి కొంతకాలంగా విబేధాలున్నాయి. ఈ క్రమలో గురువారం వీరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన ఇద్దరు యువకులు ఏడుకొండలు తలపై బీరుబాటిళ్లతో దాడి చేశారు. గాయపడిన ఏడుకొండలు శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. తలపై ఆరుకుట్లు పడ్డాయి.

## వసతి గృహం అభివృద్ధికి చర్యలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1: రెండు నెలల్లో ఎస్సీ బాలికల వసతిగృహాన్ని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహాన్ని గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. వసతి గృహంలో శ్లాబు నుంచి పెచ్చులూడటం, మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటం గుర్తించారు. రెండు నెలల్లో వసతిగృహాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.





బీఎన్‌కండ్రిగలో ఎమ్మెల్యే ఆదిమూలం- శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న దృశ్యం

# పింఛన్లతో పేదలకు ఆసరా: కలెక్టర్

ఏర్పేడు, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లు పేదలకు ఆసరాగా నిలుస్తాయని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఆమందూరు పంచాయతీలో గురువారం ఆయన ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. పింఛన్ లబ్ధిదారులు ఈసందర్భంగా కలెక్టర్‌తో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది గురువారం ఉదయాన్నే వచ్చి పింఛన్లు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గిడ్డయ్య, సర్పంచ్ గుణయాదవ్, ఏర్పేడు జడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య, ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షులు డాక్టర్ నైనారు పొన్నారావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మురగయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**బుచ్చినాయుడుకండ్రిగ:** కారణిమిట్టలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందజేశారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ చంద్రబాబునాయుడు, ఎంఈవో రవీంద్రనాథ్, సర్పంచ్ పద్మమ్మ, సుధాకర్‌నాయుడు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు

**కేవీబీపురం:** కస్తూరిపురం ఎస్టీకాలనీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇంటింటికీ తిరిగి పింఛన్లు అందజేశారు. కాలనీవాసులకు గోపీనాథరెడ్డి ఏర్పాటు చేసిన నీటి ట్యాంకును ఆయన ప్రారంభించారు. మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, పార్లమెంటరీ రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, పార్లమెంటు టీఎన్‌టీయూసీ సభ్యులు జయరామిరెడ్డి,లక్ష్మీపతిరాజు, బాలాజీ, మణి, దొరబాబునాయుడు,పావని పాల్గొన్నారు.



ఆమందూరులో వృద్ధాప్య పింఛను అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**శ్రీకాళహస్తి:** రాష్ట్రంలో పింఛన్ల పెంపు చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఆయన అధికారులతో కలిసి గురువారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఊరందూరు ఎస్టీకాలనీ, పాగాలి ఎస్టీకాలనీ, పెద్దకన్నలి ఎస్టీకాలనీలో ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులతో మాట్లాడారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పింఛన్లను పెంచుతామన్న హామీని చంద్రబాబు వెంటనే అమలు చేయడం హర్షణీయమన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మాట్లాడుతూ డబుల్ ఇంజన్ తరహాలో కూటమిపాలనలో అభివృద్ధి జరుగుతోందన్నారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, టీడీపీ నాయకులు విజయకుమార్, మునిరాజానాయుడు, కంఠా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దిరెడ్డి భూ బకాసురుడు: ఎమ్మెల్యే ఆదిమూలం ధ్వజం

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 1: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూ బకాసురుడని, అధికారం అడ్డుపెట్టుకుని వేలాది ఎకరాలు కొల్లగొట్టారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ధ్వజమెత్తారు. కారణిమిట్టలో గురువారం పెన్షన్ల పంపిణీ. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పెద్దిరెడ్డి అధికారంలో ఉండి వేలాది ఎకరాల ప్రభుత్వ, ఇతర భూములను ఆక్రమించి దోచుకున్నారని విమర్శించారు. రోజో ఆయన భూ బాధితులు క్యూకట్టి ప్రభుత్వానికి ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. పెద్దిరెడ్డి ఇద్దరు స్వతంత్రులను రంగంలోకి దింపి రూ. 20 కోట్లు ఖర్చు చేయించినా ప్రజలు తననే గెలిపించారన్నారు.చంద్రబాబు సారథ్యంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు.

## చెంగారెడ్డిపల్లిలో నీటి సమస్యకు పరిష్కారం



పైపులైనుకు గుంతలు తవ్వుతున్న దృశ్యం

రేణిగుంట, ఆగస్టు 1: చెంగారెడ్డిపల్లిలో కొత్త పైప్‌లైన్ల పనులను గురువారం ప్రారంభించారు. కరకంబాడీ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్యను స్థానిక టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జినాయుడు, రాజేంద్ర ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో వారం రోజుల్లో ఏడు బోర్లను వేశారు. నాగాలమ్మ గుడి వద్ద బోరు నుంచి చెంగారెడ్డి పల్లిలోని నీటి ట్యాంకుకు 800 మీటర్లతో పైపులైను ప్రారంభించారు. రెండురోజుల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం కానుంది.

## శాస్త్రోక్తంగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి, ఆగస్టు 1: విజ్ఞానగిరిపై వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం పార్వేట ఉత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకార మండపంలో అభిషేక పూజలు నిర్వహించారు. పూజల నంతరం ఉత్సవమూర్తులను చప్పరం అధిష్టించి పుర వీధుల్లో ఊరేగించారు. మొక్కులు తీర్చుకున్నారు.

## ఎమ్మార్పీఎస్ సంబరాలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ పట్టణంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం సంబరాలు చేసుకున్నారు. మాడ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాట్లాడుతూ వర్గీకరణతో మాదిగలకు మేలు జరుగుతుందన్నారు.

## విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 1: ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులకు గురువారం ప్రభుత్వ కంటి వైద్య నిపుణులు నారాయణస్వామి, ఊరందూరు కమ్యూనిటీ హెల్త్‌కేర్ ఆఫీసర్ ప్రవీణ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు.

## పెన్షన్ పంపిణీ చేసిన జేసీ

రేణిగుంట, ఆగస్టు 1: కరకంబాడీ పంచాయతీలో గురువారం పింఛన్ల పంపిణీ తీరును జేసీ శుభం బన్సల్ పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన పింఛన్లను పంపిణీ చేశారు.మండల వ్యాప్తంగా 90శాతం పింఛను పంపిణీ చేశారు. ఎంపీడీవో విష్ణుచిరంజీవి, పంచాయతీ కార్యదర్శి యూసఫ్‌ఖాన్, బుజ్జినాయుడు పాల్గొన్నారు. **పిచ్చాటూరు:** మండలంలోని 128 గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి నిర్వహించిన పింఛన్ల పంపిణీ సాయంత్రానికి 98 శాతం పూర్తిచేసినట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు. **ఏర్పేడు:** నగరి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కుక్కలగుంట గ్రామ పంచాయతీకి చెందిన రాజయ్యకు పంచాయతీ కార్యదర్శి పోలసాని సుధాకర్ పింఛను అందజేశారు.

## గురుకులంలో సీటు పేరిట గార్డు టోకరా



విచారణ జరుపుతున్న డీసీవో, ఎంఈవో

సత్యవేడు, ఆగస్టు 1: గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని సెక్యూరిటీ గార్డు వంచించిన వైనమిది. బాధితుల కథనం మేరకు.. బుచ్చినాయుడు కండ్రిగ మండలం నీర్పాకోటకు చెందిన సుజాత కుమార్తె నవ్యశ్రీ సత్యవేడు బాలికల గురుకుల పాఠశాలలో చదువుకుంది. ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష రాయగా పలమనేరులో సీటు వచ్చింది. సత్యవేడులో చదివించాలనే ఆశతో విద్యార్థిని తల్లి సుజాత కొందరి సూచనతో సత్యవేడు గురుకుల స్కూలు సెక్యూరిటీ గార్డు సంగీతను సంప్రదించారు. రూ.20వేలు చెల్లిస్తే సీటు ఇప్పిస్తాననడంతో సుజాత ఆమెకు రూ.20వేలు ఫోన్ పే ద్వారా చెల్లించారు. మరో విద్యార్థిని తల్లితండ్రులు కూడా రూ.15 వేలు చెల్లించారు. గడువు ముగిసినా సీటు రాకపోవడంతో డబ్బులు వెనక్కివ్వాలని సుజాత సెక్యూరిటీ గార్డును నిలదీశారు. అయినా చెల్లించక పోవడంతో సుజాత ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. గురువారం పాఠశాల గేటు వద్ద విద్యార్థి సంఘాలు ధర్నా చేశాయి. దీంతో డీసీవో పద్మజ, ఎంఈవో రవి పాఠశాలకు చేరుకుని విచారణ చేశారు.

## పరశురామేశ్వరుని సేవలో రెయిన్‌బో హెల్త్‌కేర్ సీఈవో

ఏర్పేడు, ఆగస్టు 1: గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామిని గురువారం రెయిన్‌బో హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్ సీఈవో త్రినాథకేశవ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ వేదపండితులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Sullurpet బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన లీగోట్ల ప్రకారం యావన్మందికి తెలుపునది Smt. P.Komala W/o. Gurunatham, Trunk Road, Varadaiahpalem Town & Mandal, Tirupati District గారికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిస్టరు తనఖా చేయించుకొని ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైననూ ఎలువంటి అప్పులు, దావాలు క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్, కోర్టు వివాద ములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయుగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు గారు.

**PROPERTY A SCHEDULE**

Tirupati district, Sri Balaji Registration district - Satyavedu sub registration, Varadaiahpalem town & mandal, 7 th ward 1B no. 84 S.no.212 an extent of 285.6 sq yards out of Ac.1.52 cents 2. S.No.212-2A an extent of 7398.40 sq yards out of Ac.1.75 cents total 7684 sq yards vacant site within the following boundaries: - East - Site of Santhamma, South - Site of Santhamma, West - ST colony, North - Site of Santhamma & road

**PROPERTY B SCHEDULE**

All that piece and parcel of undivided share 90 sq yards of site along with Flat G1 Ground floor admeasuring 1050 sq feet of RCC including common area and car parking in " C" block in Tulasi Avenue Residential apartment out of B schedule within the following boundaries: - East - Common corridor, South - stair case, West - Open to sky, North - car parking

**S.Sreeramulu Yadav,** M.A., B.L.,
Advocate, Off: 3-2-155, Old Shar Busstand Road, Sullurpet. Cell: 94404 56976

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

**PLOT FOR SALE**
తిరుపతి జిల్లా అప్పలాయగుంట గ్రామం, ప్రసన్న వెంకటేశ్వర స్వామి గుడి దగ్గరలో (1 నిమిషం వాక్) ఉత్తర ముఖం గల 120 అం. (40x108) సైట్ అమ్మబడును. కావలసినవారు సంప్ర. : 93465 77753
AJT - 187463

**CHANGE OF NAME**
I, hitherto known as SYED BABAJAN, S/o SHAIK MASTHAN VALI, R/o 5-58-K2-B-1, Apparaothota, Madanapalle, Annamayya District, Andhra Pradesh- 517325, have changed my name and shall hereafter be known as "SHAIK BAVAJAN."
AJT - 4153

**PLOT FOR SALE**
రంగంపేటలోని మోహన్ బాబు యూనివర్శిటీ ఎదురుగా గల Dollars 15లో తుడా అప్రూవల్ కలిగిన వెంచర్‌లో East Face కలిగిన ప్లాటు అమ్మబడును. సంప్ర. : 9866166111
AJT - 4154

**TOLET- బాడుగకు**
తిరుపతి నగరం నడిబొడ్డున మాస్ట్ రోడ్డు నందు వి.వి. మహల్‌కు ఎదురుగా Commercial Space 2200 చ.అ. మరియు 1St ఫ్లోర్ నందు separate 500 చ.అ. సం.ప్ర. సెల్: 91105 54556, 98764 01918
AJT-4151

**బంగారం కొనబడును**
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిప్పింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 189294

**అమ్మకమునకు - FOR SALE**
చంద్రగిరికి సమీపమున వ్యవసాయ క్షేత్రంలో భీమవరం బెస్ట్ బ్రీడ్ జాతి పుంజులు, పెట్టలు, పిల్ల కోళ్లు అతి సరసమైన ధరలకు అమ్మబడును. సం.ప్ర. సెల్: 91105 54556
AJT-4150

**పాఠకులకు ముఖ్యగమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

# పుత్తూరు వార్తలు

## కాయంపేటలో ఉచిత వైద్య సేవలు

వడమాలపేట, ఆగస్టు1: కాయంపేట ఎస్టీ కాలనీలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారుగా 100 మందికి పైగా ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీతారామపురం ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి విజయ చంద్రిక మాట్లాడుతూ తమ ఆయుర్వేద అసుపత్రిలో ఆయుష్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందన్నారు. శిబిరంలో సిబ్బంది ఆశీఫ్, దామోదర్, సుభాషిణి, ప్రవీణ్, ఈశ్వరి, కృష్ణలత తదితరులు పాల్గొన్నారు.

## చెక్క భజన నృత్యోత్సవ పూజ

వడమాలపేట, ఆగస్టు 1: బట్టిరెడ్డి కండ్రిగలో గురువారం చెక్క భజన నృత్యోత్సవ పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామిజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 400 మందికి ఫౌండేషన్ అన్నదానం ఏర్పాటు చేసింది. గ్రామస్థులు, కళాకారులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుంచే సమాజసేవ



స్కార్ఫ్ ధరించిన స్కౌట్స్ అండ్ గైడ్స్

పుత్తూరు టౌన్, ఆగస్టు 1: స్థానిక బాలికల కళాశాలలో స్కౌట్స్ అండర్ గైడ్స్ ట్రైనింగ్ సెంటర్లో వరల్డ్ స్కార్ఫ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘపతి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణలో విద్యార్థులకు అంకితభావం,సేవాతత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే భాను ప్రకాష్





కాయంపేటలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ - నారాయణవనంలో ఎమ్మెల్యే ఆదిమూలం పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

వడమాలపేట, ఆగస్టు 1: అర్హులందరికీ పింఛన్లు అందజేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. గురువారం కాయంపేట ఎస్టీకాలనీలో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉన్నా పింఛన్లు రానివారు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పింఛన్ మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. జడ్పీటీసీ సభ్యులు మురళీధర్ రెడ్డి, నాయకులు ఉమాపతి రావ్, చలపతి రావ్,వెంకటేష్ యాదవ్, జగత్ సాయి, అధికారులు పాల్గొన్నారు.

**నారాయణవనం:** వృద్ధులు, వికలాంగుల కళ్లలో ఆనందమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. నారాయణవనంలోని 1, 2 వార్డులలో ఆయన లబ్ధిదారులకు పింఛన్లును పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు భాస్కరన్, ఆర్‌డీ ఏకాంబరం, కేఎస్. రవి, భక్తవత్సలం, గోవిందస్వామి, హరి, వేలు రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు

## జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ

పుత్తూరు టౌన్, ఆగస్టు 1: పుత్తూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రభుత్వ పాఠ్యనోటు పుస్తకాలు, బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖామంత్రి లోకేష్ ఆదేశాల మేరకు ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా స్టూడెంట్ కిట్లను అందజేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. కళాశాల విద్యార్థులకు విద్యా కిట్లు అందజేయడం తొలిసారి అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీఎన్ ఎలుమలై, జీవరత్నం నాయుడు, గంజీ మాధవయ్య, ఎంఎం ధనపాల్, డీజీ ధనపాల్, ప్రసాద్‌నాయుడు, నారాయణబాబు, జనసేన నాయకుడు మహేష్, ప్రిన్సిపాళ్లు రఘుపతి, గోపాల్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.